

పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

వాహనాల నెంబర్ ప్లేట్లు సరిగా లేకపోతే చర్యలు

- జిల్లాలో నేటి నుంచి స్పెషల్ డ్రైవ్ : ఎస్పీ

ఏలూరు క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎవరైనా మోటారు సైకిళ్లపై ఫలానా వారి తాలూకా అని నెంబర్ ప్లేటు ఉంటే తక్షణం వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద గురువారం పోలీసు అధికారులకు ఈ మేరకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం నుంచి ఈ ఆదేశాలు అమలు చేయాలన్నారు. మోటారు వాహన చట్టం నిబంధన ప్రకారం నెంబర్ ప్లేట్లు ఖచ్చితమైన సైజులో ఉండాలని ఎవరైనా ఇష్టానుసారంగా నెంబర్ ప్లేట్లు తయారు చేయించి వేయించుకుంటే ఆ వాహనాలు సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. అంతేకాకుండా నెంబర్ ప్లేట్లు తయారు చేసే వారిపై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన స్కూల్‌బస్సు

స్కూల్ బస్సు డ్రైవర్‌కు ఫిట్స్

- రోడ్డు సైడ్ కాలువలోకి దూసుకెళ్లిన బస్సు
- 30 మంది విద్యార్థులు క్షేమం

ఆగిరిపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాల బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులకు పెనుప్రమాదం తప్పింది. ఈదరలో గురువారం ఉదయం విద్యార్థులు ఎక్కించుకుని ఆగిరిపల్లి వస్తున్న ఎస్ఎఫ్ఎస్ స్కూల్ బస్సు ఈదర వేబ్రిడ్జి వద్దకు రాగానే డ్రైవర్‌కు ఫిట్స్ వచ్చాయి. దీంతో అతను బస్సును అదుపు చేయలేక పోవడంతో రోడ్డు పక్కనే ఉన్న సైడ్ కాలువలోకి దూసుకు పోయింది. సమీపంలోని గ్రామస్థులు హుటాహుటీన వచ్చి విద్యార్థులను బయటకు తీశారు. బస్సులో ప్రయాణిస్తున్న 30 మంది విద్యార్థులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎంఈవో -1 హేబేలు మాట్లాడుతూ స్కూల్ బస్ ప్రమాదానికి గల కారణాలను విచారించి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

సొంతగూటికి!

- ఐసీడీఎస్‌కు ప్రధానమంత్రి మాతృ వందన యోజన అప్పగింత
- 2014లో ఉమ్మడి పశ్చిమలో పైలెట్ ప్రాజెక్టు.. దశాబ్దం తర్వాత ఆరోగ్యశాఖ నుంచి బదిలీ
- జిల్లాలో 2,338 మంది లబ్ధిదారులు

(ఏలూరు- ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఈ పథకాన్ని 2014లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మహిళా, శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించారు. గర్భం దాల్చిన నాటి నుంచి మందులు ఇతర అవసరాల కోసం మహిళలకు ఈ పథకంలో అందించే సొమ్ము ఉపయోగపడుతుంది. ఇది సక్సెస్ కావడంతో రెండేళ్ల పాటు నడిపింది. తదనంతరం ఈ పథకాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు బదలాయించారు. దశాబ్ద కాలం తర్వాత ఈ పథకం నిర్వహణ బాధ్యతలను మరల ఐసీడీఎస్ గూటికి అప్పగించారు. దీంతో రాబోయే కాలంలో దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారులకు ఆయా మొత్తాల జమ ఐసీడీఎస్ పీడీ పి.శారద పర్యవేక్షణలోనే వివిధ దశల్లో మొత్తాల పంపిణీ ఉంటుంది.

ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) అమలు బాధ్య తలను తాజాగా ఐసీడీఎస్‌కు అప్పగించారు. ఇప్పటివరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణలో ఇది అమలయ్యేది. మాతృత్వపు మధురిమలు.. మహిళల జీవితంలో అదొక అపూర్వ ఘట్టం. తొలిసారి అమ్మలయ్యే మహిళలకు ఆరోగ్య సంరక్షణకు పీఎంఎంఈవై భరోసా ఇస్తోంది. ఒకరకంగా పురిట్లో మరణాల నివారణకు ఈ పథకం ఒకానొక దశలో పేద మహిళలకు అండగా నిలిచిందనే చెప్పాలి.



పథకం అమలు ఇలా..

గర్భం దాల్చిన తర్వాత మహిళలు సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నమోదు చేయించుకున్నప్పుడు రూ.మూడు వేలు, జనన నమోదు, మొదట విడత టీకా (14 వారాలు) నమోదు చేసినప్పుడు రూ.2వేలు.. మొత్తం రూ.ఐదు వేలు జమ చేస్తారు. ఈ రెండు విడతల్లోనూ ఆధార్‌తో అనుసంధానించిన వారి బ్యాంకు ఖాతా జమ చేస్తారు. ఈ పథకం ద్వారా అర్హులైన గర్భిణులకు మొదటి కాన్పుకు రూ.ఐదు వేలు ఇస్తారు. రెండో కాన్పులో ఆడపిల్ల పుట్టితే రూ.ఆరు వేలు అందజేయనున్నారు. జిల్లాలో 2025-26 సంవత్సరానికి 2,338 మంది నమోదయ్యారు. మొదటి విడత, మొదటి కాన్పుకు 541 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.మూడువేలు చొప్పున రూ.16.23 లక్షలు జమ చేశారు. రెండో కాన్పులో ఆడపిల్ల జన్మించిన 760 మందికి మహిళలకు ఒక్కొక్కరికి రూ.ఆరు వేల చొప్పున రూ.45.60 లక్షలు జమ చేశారు. ఇంకా 1,037 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నిధులను విడుదల చేయాల్సి ఉంది.

రిజిస్ట్రేషన్లకు త్వరలో చర్యలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకాన్ని ఇటీవల మా శాఖకు అప్పగించారు. రికార్డులను అప్‌డేట్ చేస్తున్నాం. పారదర్శకంగా అమలు చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటు న్నాం. కొత్తగా గర్భిణుల నుంచి దరఖాస్తులు తీసుకునే అంశంపై మాకు ఇంకా గైడ్‌లెన్స్ రాలేదు. జిల్లాలోని 10 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,225 అంగన్‌వాడీ కేంద్రాల వారీగా ఈ పథకం ప్రారంభించేందుకు లాగిన్‌లు, ఇతర ఆన్‌లైన్ ప్రాసెస్‌ను ప్రారంభించాం.

- పి.శారద, ఐసీడీఎస్ పీడీ

ఫొటోల కలకలం

- కాపురంలో చిచ్చు.. యువతి తండ్రి ఆత్మహత్యాయత్నం
- మీర్జాపురంలో ఉద్రిక్తత.. గ్రామంలో పోలీస్ పికెట్

నూజివీడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెండు కుటుంబాల మధ్య వ్యక్తిగత వివాదాల నేపథ్యంలో ఓ యువకుడు పంపిన ఫొటోలతో తన కుమార్తె కాపురం కూలిపోగా, ఆమెపై గ్రామంలో అసభ్య ప్రచారం చేస్తుం డడంతో తట్టుకోలేక ఆమె తండ్రి పురుగులమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడడంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరా లివి.. నూజివీడు మండలం మీర్జాపురం గ్రామానికి చెందిన బెజవాడ శ్రీనివాసరావు (55), మనుకూరి సురేష్ (30) కుటుంబాల మధ్య వ్యక్తిగత వివాదాలు ఉన్నాయి. సురేష్‌కు వివాహం కాలేదు. కాగా శ్రీనివాసరావు కుమార్తెకు వివాహమై గుడివాడ సమీపంలో భర్త, పిల్లలతో కలిసి నివసిస్తోంది. ఆమెకు సురేష్ కొన్ని రోజులుగా ఫోన్‌లో అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుతూ వేధి స్తున్నాడు. ఈ క్రమంలోనే ఆమెతో పాటు తాను ఉన్న పాత ఫొటోలను ఆమె భర్తకు పంపించాడు. దీంతో ఆమె భర్త ఆమెను, ఇద్దరు పిల్లలను మీర్జాపురంలోని తన మామగారి ఇంట దించి వెళ్లిపోవడంతో ఆగ్రహించిన శ్రీనివాసరావు, అతని బంధువులు మంగళవారం సురేష్‌ను స్తంభానికి కట్టి దేహశుద్ధి చేశారు. అనంతరం సురేష్ బంధువులు శ్రీనివాసరావు ఇంటిపై దాడి చేయడానికి ప్రయత్నిం చడంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. సురేష్ బంధువులు తన కుమార్తెపై గ్రామంలో అసభ్య ప్రచారం చేస్తుండడంతో అవమానం భరించలేక శ్రీనివాసరావు బుధవారం పురుగుల మందు తాగుతూ సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. అతని బంధువులు గాలించగా పొలాల్లో పడివున్న అతన్ని గుర్తించి హుటాహుటీన బుధవారం సాయంత్రం విజయవాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉంది. మరోవైపు రెండువర్గాలు ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకోగా సురేష్ వర్గీయుల ఫిర్యాదుపై మాత్రమే కేసు నమోదు కాగా మరో కేసు నమోదులో జాప్యం జరగడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు దారి తీశాయి. గురువారం గ్రామాన్ని నూజివీడు డీఎస్పీ కె.వి.వి ప్రసాద్, రూరల్ సీఐ రామకృష్ణతో కలిసి సందర్శించి విచారణ చేపట్టి ఇరువర్గాల నాయకులను పిలిచి సర్దిచెప్పారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.



సురేష్‌ను స్తంభానికి కట్టి కొట్టిన దృశ్యం



పురుగుల మందు తాగుతున్న శ్రీనివాసరావు

గోదావరి పుష్కరాలకు రైల్వేశాఖ పనులు

- రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఆనంద పాటిల్

నరసాపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలకు రైల్వే ముందస్తు ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఆనంద పాటిల్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో రూ.30 కోట్లతో నిర్మిస్తున్న అమృత్‌భారత్ రైల్వేస్టేషన్ నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉన్న రాజమండ్రి, కొవ్వూరు, నరసాపురం స్టేషన్లలో అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి భక్తుల రద్దీకి అనుగుణంగా రైళ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపడతామన్నారు. భక్తుల తాకిడిని తగ్గించేందుకు సమీపంలో ఉన్న స్టేషన్లల్లో కూడా అవసరమైన పనులు చేపడతామన్నారు. దానిలో భాగంగా నిడదవోలు స్టేషన్‌ను గుర్తించామన్నారు. ఇటు నరసాపురం స్టేషన్‌లో కూడా అవసరమైన పనుల్ని చేపట్టనున్నట్లు డీఆర్ఎం చెప్పారు. డివిజన్‌లో రూ.720 కోట్లతో కొత్తగా నిర్మిస్తున్న 24 అమృత్ భారత్ రైల్వే స్టేషన్‌లలో నాలుగు స్టేషన్ల పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. వాటిలో తుని, కాకినాడ, నిడదవోలు, రామవరపుపాడు స్టేషన్ పనులు ఉన్నట్లు డీఆర్ఎం చెప్పారు. త్వరలో ప్రధాని మోది వీటిని ప్రారంభిస్తారన్నారు.



శిథిలావస్థలోని కొత్త రామయ్యపేట బ్రిటీష్ కల్వర్టు

కల్వర్టు క(వ్య)థ!

- శిథిలావస్థలో కొత్త రామయ్యపేట బ్రిటీష్ కాలం నాటి కల్వర్టు
- పునరుద్ధరణ ఊసేలేదు.. తరచూ ప్రమాదాలు

పోలవరం, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): ఇక్కడ కన్పిస్తున్న ఈ కల్వర్టుకు పెద్ద చరిత్రే ఉంది. ఎప్పుడో బ్రిటీషు పాలనలో దీనిని నిర్మించారు. అప్పటి నుంచి ఈ కల్వర్టు పునరుద్ధరణ చర్యలు లేక శిథిలావస్థకు చేరుకుంది. ఎన్నోసార్లు ఈ మార్గంలో రోడ్డు వేసినా ఈ కల్వర్టు పునరుద్ధరణకు నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. పోలవరం నుంచి తహసీల్దారు కార్యాలయం మీదుగా కొత్తరామయ్యపేట పునరావాస గ్రామాలకు, ఇటుకలకోట, బోడిగూడెం, వింజరం గుంజవరం మీదుగా దొండపూడి కన్నాపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం వెళ్లే ప్రధాన రహదారిలో ఈ బ్రిటీష్ కాలం నాటి కల్వర్టు ఉంది. 1908లో (మిగతా 8వ పేజీలో)

రెండు బార్లకు లైసెన్సుల కేటాయింపు



బార్ల కేటాయింపునకు లాటరీ తీస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు,సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలో 2025-26 సంవత్సరానికి ఓపెన్ కేటగిరిలో రెండు బార్లకు కలెక్టరేట్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్వి లాటరీ తీసి ఆయా యజమానులకు లైసెన్సుల జారీ ప్రక్రియను గురువారం చేపట్టారు. ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, జిల్లా సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లాటరీ తీశారు. ఈ లాటరీ ద్వారా ఇప్పటి వరకు రూ.59.13 లక్షలు ఆదాయం సమకూరిందని కలెక్టర్ వివరించారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్లు జి.పాండురంగారావు, అజయ్‌కుమార్ సింగ్, ఎక్సైజ్ సీఐ ధనరాజ్‌లు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం : కలెక్టర్

ఏలూరుసిటీ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):రానున్న ఖరీఫ్‌లో జిల్లాలో నాలుగు లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పటిష్ఠ ప్రణాళికలతో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం రానున్న ఖరీఫ్‌లో ధాన్యం సేకరణపై ముందస్తు ప్రణాళికపై నిర్వహించిన సమావేశంలో అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్‌లో లక్షా 91వేల 534 ఎకరాల్లో ఖరీఫ్ సాగవుతుండగా, 5లక్షలు 74వేల 552 మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా ఉందని, దానిలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి మద్దతు ధరకు సేకరించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఖరీఫ్‌లో ధాన్యాన్ని తేమ శాతాన్ని అనుసరించి క్వింటాలుకు కామన్ రకాన్ని రూ.2,369, గ్రేడ్‌ఏ రకాన్ని రూ.2,389ల చొప్పున ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తారన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ముందే గ్రామ స్థాయిలో ఈ-పంట, , ఈకేవైసీ నమోదు నూరుశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 265 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కంప్యూటర్లు గోనెసంచులు , వేయింగ్ మిషన్లు, తేమ శాతం కొలిచే పరికరాలు కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేయాలన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి, డీఎస్‌వో ఈబీ విలియమ్స్, , సివిల్ సప్లయిస్ డీఎం శివరామమూర్తి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ బాషా, ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం, డీసీవో శ్రీనివాస్, డీసీఎంఎస్ బి.ఎం.కృష్ణ మోహన్, ఎఫ్‌సీఐ డీఎం కె.పి.రెడ్డి, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ట్రాన్స్‌పోర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

83,761 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా

జిల్లాలో ఇంతవరకు 83,761 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు సరఫరా చేశామని కలెక్టర్ వెట్రిసెల్వి చెప్పారు. జిల్లాలో ఇంకా 29,512 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని శుక్రవారానికి మరో 259 మెట్రిక్ టన్నుల ఎరువులు రానున్నాయని, జిల్లాలో ఎరువులకు ఎటువంటి కొరత లేదన్నారు. జిల్లాలో ప్రస్తుతం 2,660 మెట్రిక్ టన్నుల యూరియా, 4,664 మెట్రిక్ టన్నుల డీఏపీ, 4,109 మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 12,689 టన్నుల ఎన్‌పీకే , 5,390 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పి ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

ఉపాధ్యాయ అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ వాయిదా
- భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో నిర్ణయం

ఏజెన్సీ ప్రాంతంలో ఆయుధ డిపో
గిరిజన ప్రాంత అభివృద్ధిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టి

■ లోపలి పేజీలో..



వేంకటేశ్వరస్వామికి పవిత్రాలు సమర్పిస్తున్న అర్చకులు

కాళ్లకూరు వెంకన్న ఆలయంలో పవిత్రోత్సవాలు

కాళ్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కాళ్లకూర వేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తనదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గురువారం స్వామి, అమ్మవార్లకు యాగశాల అర్చన, హోమాలు, కుంభా వాహన, చక్రాబ్ది మండలార్చన, పవిత్రాధివాసం కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి యాగశాల అర్చన, నిత్యోపాసన, నారసింహ, సుదర్శన హోమాలు, చక్రాబ్ది మండలార్చన, పవిత్రాధివాసం కార్యక్రమాలు వేదమంత్రాలు నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో ఎం.అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వీరభద్రస్వామిపై సూర్య కిరణాలు



స్వామి వారిని తాకిన సూర్య కిరణాలు

పెనుమంత్ర, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం జుత్తిగ ఉమా వాసుకి రవి సోమేశ్వరస్వామి ఆలయ ప్రధాన మంటపంలో వీరభద్ర స్వామి వారిని గురువారం సాయంత్రం సూర్య కిరణాలు తాకాయి. 5.29 గంటల నుంచి 5-36 వరకు (8 నిమిషాలు) సూర్య కిరణాలతో వెలుగులు చిమ్ముతున్న స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ర్యాలీ వాసు శర్మ మాట్లాడుతూ ఏటా వీరభద్ర స్వామి మూల విరాట్ పై సూర్యకిరణాలు పడతాయని తెలిపారు.

22 నుంచి మావుళ్లమ్మ ఆలయంలో

శరన్నవరాత్రి ఉత్సవాలు

భీమవరం టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ ఆలయంలో ఈ నెల 22 నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు గురువారం ఆవిష్కరించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు సౌకర్యాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఇతర శాఖలకు సంబంధించిన అధికారులను సమన్వయం చేసుకుని ఉత్సవాలు విజయవంతం చేయాలన్నారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్దా మహాలక్ష్మి నగేష్ మాట్లాడుతూ అమ్మవారికి 11 అవతారాలను అలంకరిస్తామన్నారు. 22న స్వర్ణ రజిత అలంకారం, 23న బాలా త్రిపుర సుందరి, 24న గాయత్రీదేవి, 25న అన్నపూర్ణాదేవి, 26న మహాలక్ష్మి దేవి, 27న లలితా త్రిపుర సుందరి, 28న మహా చండీదేవి, 29న సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, 1న మహిషాసుర మర్ధిని, 2న రాజరాజేశ్వరీ దేవి అలంకారం చేస్తామన్నారు. 2న అమ్మవారికి గ్రామోత్సవం ఉంటుందని, 4న అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ, తదితరులు ఉన్నారు.



పాలకొల్లు కనకదుర్గ ఆలయంలో..

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక యడ్ల బజారులో కనకదుర్గ ఆలయంలో ఈనెల 22 నుంచి శరన్నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈవో ఎస్.సతీష్ కుమార్, సిబ్బంది సీహెచ్.రాంబాబు, సత్యనారాయణ, అర్చకులు ఎం.వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని తొమ్మిది రోజులు రోజుకు ఒక అవతారంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అలంకరించనున్నారు. ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. వాసవీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించనున్నారు. చిన్నగోపురం, శంభేశ్వరస్వామి, అమ్మవార్ల ఆలయాలు, పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక మండపాలను ఏర్పాటుచేసి 9రోజులు ప్రత్యేక పూజలు చేయడానికి ఆయా ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

పంచారామాలకు పాలకవర్గాలు

సోమేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా బంగార్రాజు



ఎమ్మెల్యే అంజిబాబు నుంచి నియామక పత్రం అందుకుంటున్న బంగార్రాజు

భీమవరం టౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గునుపూడిలోని పంచారామ క్షేత్రమైన ఉమా సోమేశ్వర జనార్దనస్వామి దేవస్థానం పాలకమండలిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ ధర్మకర్తల మండలి సభ్యుల పేర్లతో నియామక పత్రాలు పంపించారు. సభ్యులుగా చింతలపాటి బంగార్రాజు, బి సత్యప్రసాద్, బి.కృష్ణవేణి, పి.లీల, పి.వెంకట రామకృష్ణ, సాయి నాగేంద్ర విజయలక్ష్మి కుమారి, వై.రమేష్, బి.రమణ, పి.శ్యామ్ కుమార్, పి.జ్యోతిర్మయి, కె.విజయకుమార్, అర్చకులు కందుకూరి సోమేశ్వరరావును ఎక్స్ అఫీషియో సభ్యునిగా నియమిస్తూ ఉత్తర్వులు పంపించారు. రెండేళ్ల కాలపరిమితితో ట్రస్టు బోర్డు నియమించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ చింతలపాటి బంగార్రాజును ఎన్నుకోనున్నారు. ఇప్పటి కే ఆయన పేరును ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ప్రకటించారు. ధర్మకర్తల మండలి సభ్యుడిగా నియామక పత్రాన్ని ఎమ్మెల్యే అంజిబాబు చింతలపాటి బంగార్రాజుకు అందజేసి అభినందనలు తెలిపారు.

క్షీరారామం పాలక మండలి చైర్మన్‌గా మీసాల రాము



పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ పాలక మండలి సభ్యులను ప్రభుత్వం నియమించింది. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి గురువారం బాధ్యతలు స్వీకరించారు. సభ్యులతో ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పాలకవర్గ అధ్యక్షుడిగా మీసాల రామ చంద్రరావు (రాము)ను ఎన్నుకున్నారు. సభ్యులుగా నాళం నాగ వెంకట సురేఖ, పినిశెట్టి శ్రీనివాస్, కొండ్రెడ్డి సూర్యనారాయణ, పెన్మెత్స శ్రీదేవి, బాసిన అప్పల నాగ సత్యనారాయణ, వందరపు కుమారి, నీలాపు సింహాచలం, నీలాపు మణి ప్రమాణ స్వీకారం చేశారు.

భక్తి విలువలు తెలిపే అనంతాళ్వార్ సినిమా

సినీనటుడు బాలాజీ



అభిమానులతో నటుడు బాలాజీ

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువతకు భక్తి విలువ తెలియజెప్పేలా భక్తాగ్రేశ్వరుడు అనంతాళ్వార్ సినిమా నిర్మించనున్నట్లు సినీనటుడు, కారెక్టర్ ఆర్టిస్ట్ బాలాజీ తెలిపారు. చినవెంకన్న ఆలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం ఆయనను చూసిన పలువురు అభిమానులు ఫొటోలు దిగారు.

ఏజెన్సీ ప్రాంతంలో

ఆయుధ డిపో



వంకా వారిగూడెం- దాట్లవారిగూడెం గ్రామాల మధ్య ఆయుధ డిపో ఏర్పాటు చేసే ప్రదేశం

గిరిజన ప్రాంత అభివృద్ధిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టి

- జీలుగుమిల్లి మండలం వంకా వారిగూడెం పరిసరాల్లో 1166 ఎకరాల సేకరణ
- రూ.2వేల కోట్లతో నేవీ ఆయుధాల డిపో
- 10 వేల మందికి ఉపాధి అవకాశాలు
- గిరిజన యువతకు ప్రయోజనం
- భూ సేకరణపై డ్రోన్ సర్వే
- గ్రామసభల్లో గిరిజనులతో చర్చ



నేవీ ఆయుధ డిపో ఏర్పాటుతో ప్రయోజనాలు వివరిస్తున్న ఎంపీ మహేశ్ (ఫైల్)

గిరిజనులకు ఇబ్బందులు ఉండవు

ఆయుధ డిపో ఏర్పాటుపై అనేక అపోహలు న్నాయని, గిరిజనులకు ఎటువంటి లోటు రానివ్వబోమని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. గిరిజనుల అభిప్రాయాలకు తగ్గట్టు ప్రయోజనాలు కల్పిస్తామని హామీ ఇస్తున్నారు. గత ఏడాది జరిగిన గ్రామసభల్లో పలువురు ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు, గిరిజనుల జీవన విధానానికి ఎటువంటి నష్టం జరగకుండా 18 ఏళ్ల నిండిన వారికి ప్యాకేజీ, ఉద్యోగ అవకాశాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు రవాణా సౌకర్యాలు అనువుగా మారనున్నాయి. 33 ఎకరాల్లో మాత్రమే నేవీ ఆయుధ డిపో నిర్మాణాలు జరుగుతాయని, ఆయా గిరిజన కుటుంబాలకు పూర్తి పరిహారం చెల్లించిన అనంతరమే నేవీ డిపో ఏర్పాటు పనులు జరుగుతాయని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు.

జీలుగుమిల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మూరుమూల ఏజెన్సీ ప్రాంతంలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఆయుధ డిపో ఏర్పాటుతో పోలవరం నియోజకవర్గం పలు రంగాల్లో అభివృద్ధిపథంలో దూసుకుపోతుందని ఈ ప్రాంతవాసులు భావిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలోనే నేవీ ఆయుధ డిపో వంకవారిగూడెం పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసేందుకు కేంద్రం ప్రతిపాదించింది. వంకవారిగూడెం, పంచాయితీ పరిధిలో గ్రామాల్లో సుమారు 1166.55 ఎకరాల సేకరణకు జిల్లా ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే పలుసార్లు వంకవారిగూడెం, దాట్లవారిగూడెం, మడకంవారిగూడెం గ్రామాల్లో కుటుంబాల సంఖ్య, భూముల స్థితిగతులుపై రెవెన్యు అధికారులు సర్వేతో పాటు డ్రోన్ సర్వే సైతం పూర్తి చేశారు. సంబంధిత భూసేకరణ వివరాలపై నేవీ డిపో సంబంధిత విశాఖపట్నం అధికారులతో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ చర్చించారు. ఆయా అంశాలపై స్థానిక ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నేవీ డిపో ఏర్పాటుకు ఎటువంటి అడ్డంకులు లేకుండా ఇప్పటికే పలుసార్లు స్థానిక గిరిజనులతో గ్రామసభల్లో చర్చించారు.

అభివృద్ధికి బాట

ఆయుధ డిపో ఏర్పాటుతో గిరిజన ప్రాంత అభివృద్ధికి బాట పడుతుందని, కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు వేగంగా ముందుకు సాగేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారు. ఈ ప్రాంత యువతకు భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని స్థానికులు ఆశాభావంతో ఉన్నారు. ఆయుధ డిపో ఏర్పాటు చర్యలతో అందరి దృష్టి జీలుగుమిల్లి మండల అభివృద్ధిపై పడింది. ఈ ప్రాంతంలో సాంకేతిక ప్రగతితో ఉపాధి అవకాశాలు మెండుగా రానున్నాయ ని, సుమారు పదివేల మందికి ఉపాధి అవకాశాలు వచ్చే వీలుందని ఎంపీ మహేశ్‌కుమార్ ప్రజలకు తెలియజేశారు. నేవీ ఆయుధ డిపో ఏర్పాటుచేస్తే సరిహద్దు తెలంగాణ ప్రాంతం అశ్వారావుపేట, సత్తుపల్లి వరకు మరోపక్క మెట్టప్రాంతమైన జంగారెడ్డిగూడెం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు.

రవాణా సౌకర్యాలు మెరుగు

కేంద్రం ద్వారా సత్తుపల్లి-కొవ్వూరు రైల్వేలైన్, గ్రీన్ ఫీల్డ్ హైవే రూటుకు సమీపంగా ఏర్పాటు చేస్తారని, టి.నరసాపురం మండల సమీపంలో రైల్వే లైన్ రానుందనే విషయం చర్చకు వస్తోంది. దీంతో టి.నరసాపురం మండలం నుంచి జీలుగుమిల్లి వచ్చే రహదారుల రూపు రేఖలు పూర్తిగా మారనున్నాయంటున్నారు. ఇప్పటికే జీలుగుమిల్లి నుంచి వయా బుట్టాయగూడెం పట్టిసీమ ఎన్‌హెచ్ 365 బీబీ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించడం గమనార్హం. దీంతో పాటు పోలవరం ప్రాంతం పర్యాటక అభివృద్ధి మిళితమై ఉందంటున్నారు. ఈ ప్రాంతంలో 2వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తే అందుకు తగ్గట్టుగా వారికి కావాల్సిన నిత్యావసరాలు, ఆహారం ఇతర అవసరాలు తీర్చేందుకు హోటళ్లు, ఆస్పత్రులు, వ్యాపార లావాదేవీలు సాగించే క్రమంలో మాల్స్ ఏర్పాటు కావచ్చని భావిస్తున్నారు. సమీపంలో స్థానికంగా గిరిజనులు జీవనం సాగించేందుకు అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాప్రతినిధుల ద్వారా సందేశం ఇస్తున్నాయి. అదే సమయంలో గిరిజన సంఘాల నుంచి ఆయుధ డిపో ఏర్పాటుపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గిరిజనుల జీవనం, పర్యావరణ ముప్పుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులకు అవగాహన కల్పించేందుకు అధికారులు గ్రామసభలు నిర్వహించారు.



2023లో అధికారులు నిర్వహించిన గ్రామసభ



తణుకు మండలం దువ్వ వరిఘేడు రోడ్డు, వయ్యేరు మార్జిన్‌లో పేరుకుపోయిన చెత్త



అత్తిలి మండలం మంచిలి సంపద కేంద్ర పక్కనే పడేసిన చెత్త

సంపద చెత్త.. చెత్త..

పారిశుధ్యం అంతంతమాత్రం

పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు, చెత్త నుంచి సంపద సేకరణ లక్ష్యంగా గతంలో టీడీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తర్వాత వైసీపీ పాలనలో నిర్లక్ష్యంతో సంపద కేంద్రాలు చెత్త చెత్తగా మారాయి. నిర్మాణం పూర్తయిన షెడ్లను గాలికొదిలేయడంతో కొన్ని చోట్ల అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారయి. మరికొన్ని చోట్ల పరిసరాల్లోనే చెత్త పడేస్తున్నారు. సంపద సృష్టి లేకపోగా పారిశుధ్యంగా అధ్వానంగా మారింది.

- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- సంపద కేంద్రాల షెడ్లలో అసాంఘిక కార్యకలాపాలు
- పరిసరాల్లో చెత్త కుప్పలు
- సమీప రైతులకు తప్పని తిప్పలు
- ఆదాయం లేకపోగా నిధులు వృథా



తణుకు రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): దువ్వ గ్రామంలో చెత్త నుంచి సంపద సృష్టించేందుకు నిర్మించిన షెడ్‌లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వయ్యేరుకు గట్టుపై సుమారు ఏడేళ్ల క్రితం నిర్మించిన షెడ్‌లో ఇప్పటి వరకూ గ్రామంలో సేకరించిన చెత్తను తరలించలేదు. వర్మీ కంపోస్టు తయారు చేయలేదు. షెడ్‌లో వర్మీ కంపోస్టు తయారీ కోసం ఏర్పాటు నాడాప్ పిట్‌లు పేకాట, మద్యం సేవించేందుకు అనుకూలంగా ఉన్నాయి. గ్రామంలో ఆకతాయిలు, పేకాటరాయుళ్లతో పాటు ఇతర గ్రామాల జూదరులు కూడా వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. షెడ్‌లో రాత్రి, పగలు తేడా లేకుండా పేకాట, మద్యం సేవించి ఖాళీ బాటిల్స్ పక్కనే పంట చేలల్లో విసిరేస్తున్నారు. సీసా పెంకులతో పొలంలో పని చేసే రైతులు, కూలీలు గాయపడుతున్నారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన షెడ్ నిరుపయోగం కావడంతో ఎదురు ఇబ్బందులు వస్తున్నాయి. సేకరించిన చెత్తను వయ్యేరు గట్టు, దువ్వ, వరిఘేడు రోడ్డు పక్కన వేయడంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..!

అత్తిలి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సంపద కేంద్రాలకు తరలాల్సిన చెత్త రోడ్డు పక్కన దర్శనమి స్తుంది. సంపద కేంద్రాలను నిర్లక్ష్యం చేయడంతో ఎక్కడి చెత్త అక్కడ వేస్తున్నారు. తడి పొడి చెత్త నిర్వహణకు ఆరేళ్ల క్రితం యంత్రాలు అందజేశారు. తరువాత పట్టించుకోకపోవడంతో లక్షల విలువైన యంత్రాలు నిరుపయోగంగా మారాయి. చెత్తను రహదారుల పక్కన, కాలువల వద్ద పారబోస్తున్నారు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. మండలంలోని 12 పంచాయతీల్లో 10 మేజర్, 8 మైనర్ పంచాయతీలు. సుమారు 15 చెత్త సంపద కేంద్రాల్లో తడి పొడి చెత్త నిర్వహణకు షెడ్డులు నిర్మించారు. చెత్త రోడ్డు పక్కన వేయడంతో సంపద సృష్టి లక్ష్యం నీరుగారింది.

గ్రామంలో చెత్త సేకరణ సమయంలో తడి పొడి చెత్త వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తే నిర్వహణ సజావుగా సాగుతుంది. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో సంపద సృష్టి జరగకపోగా, పారిశుధ్య సమస్య ఎదురవుతోంది.



పాఠశాల సమీపంలో బోదె పక్కన వేసిన చెత్త, మద్యం సీసాలు

పాఠశాల సమీపంలో అపారిశుధ్యం

చెత్త కుప్పలు.. మద్యం సీసాలు సమీప ప్రాంతాల్లో దుర్గంధం

ఆకివీడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పాఠశాల సమీపంలో చెత్త పడేయంతో డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోంది. దుర్వాసన వ్యాపించి విద్యార్థులు, పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తతో పాటు సీసాలు బయట వేయవద్దని నగర పంచాయతీ చెత్త సేకరణ రిక్షాలు, ట్రాక్టర్లు వచ్చినప్పుడే వేయాలని అధికారులు వేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికి కొందరు తమ ఇష్టం వచ్చినప్పుడు పాఠశాలల సమీపంలో పారవేస్తున్నారు. శివాలయం వద్ద పాఠశాల పక్కనే చెత్త వేస్తున్నారు. అక్కడ మురుగుబోదె కూడా ఉండడంతో దుర్వాసనతో విద్యార్థులు, ఉపాధ్యాయులు రోగాలు బారిన పడుతున్నారు. రాణా వీధిలో ఉన్న మరో పాఠశాల పక్కన చెత్త, పాడైన వస్తువులు పడేస్తున్నారు. పలుమార్లు అధికారులు హెచ్చరించినా అర్ధరాత్రి, తెల్లవారుజామున చెత్త తెచ్చి వేసేస్తున్నారు. వర్షాకాలం కావడంతో ఒకరోజు చెత్త తీయకపోతే కుళ్లిపోయి దుర్గంధంతో అనారోగ్య పరిస్థితులు నెలకొన్నాయి.



భారీ యంత్రాలతో పనులు

25 వరకు రైల్వేగేటు మూసివేత

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులలో భాగంగా రైల్వేగేటును మూసివేశారు. ఈనెల 25 వరకు గేటు మూసివేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎట్టి పరిస్థితులలో గేట్ తీయడం జరగదన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి రాకపోకలు పునరుద్ధరిస్తామన్నారు. ప్రయాణికులు, వాహనదారులు సహకరించాలని కోరారు.



ఆర్వోబీ పనుల్లో ఏర్పాటుచేసిన గడ్డర్స్

ఉండి-ఆకివీడు రోడ్డులో చురుకుగా

ఆర్వోబీ నిర్మాణం

• పిల్లర్స్ పూర్తి • స్టీల్ గడ్డర్ల ఏర్పాటు పనులు • భారీ యంత్రాలతో పనులు

ఉండి, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): ఉండిలో ఆర్వోబి నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. గురువారం నుంచి స్టీల్ గడ్డర్ పనులను చేపట్టారు. ప్రాజెక్టు మేనజర్ యశ్వంత్‌కుమార్ పర్యవేక్షణలో ఈపనులను చురుకుగా సాంకేతిక ఇబ్బందులు లేకుండా ప్రణాళికతో చేపడుతున్నట్లు తెలిపారు. గడ్డర్స్‌ను కింది నుంచి క్రేన్ సాయంతో పైకి తీసుకుని వెళ్లి వాటిని వంతెన రూపం తీసుకుని రావడం జరుగుతుందన్నారు. ఇందుకోసం 6స్టీల్ గడ్డర్స్‌ను తయారుచేసి సిద్ధం చేశామని, ప్రస్తుతం రెండు గిడ్డర్స్ అమర్చినట్లు చెప్పారు. నాలుగు రోజుల్లో 4 గడ్డర్స్ అమర్చనున్నట్లు చెప్పారు.

భారీ యంత్రాలు సిద్ధం

రైల్వేగేటుకు ఆనుకుని ఉండి వైపు ప్రాంతంలో మరోఖానా వేయడానికి భారీ యంత్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. యంత్రం సాయంతో డ్రిల్లింగ్ చేసి తదుపరి మిగతా పనులను పూర్తిచేస్తామన్నారు.

వాహనదారులకు ఇబ్బందులు

నిర్మాణ పనులపై ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా పనులను చేపట్టడంతో ప్రయాణికులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం రైల్వేగేటు తీసి ఉంచడంతో మోటార్‌సైకిల్‌పై కొందరు రాకపోకలు సాగించారు. తర్వాత కొద్ది సేపటికి మూసివేయడంతో వెళ్లిన వారు తిరిగి వచ్చిన వారు నిలిచిపోయారు. చుట్టు తిరిగి వెళ్లాల్సి వచ్చిందన్నారు. రైల్వేవారు ప్రయాణికులకు చెప్పడానికి ఎక్కడకక్కడ కొందరిని ఏర్పాటు చేశారు.



ఉండి పెద్దవంతెన సెంటర్‌లో వాహన మళ్లింపు సూచిక

వాహన రాకపోకలు మళ్లింపు

ఉండి-ఆకివీడులో రోడ్డులో ఆర్వోబి పనుల నిమిత్తం వాహనాల రాకపోకలు మళ్లించారు. భీమవరం నుంచి ఆకివీడు మీదుగా ఏలూరు వెళ్లే వాహనాలను ఉండి మీదుగా పాములపర్రు కోలమూరు, ఆరేడు నుంచి గణపవరం వైపు వెళ్లనున్నాయి. ఆకివీడు నుంచి భీమవరం వైపు వాహనాలు ఉండి నుంచి పెదపుల్లేరు మీదుగా సీసలి పెదమీరం మీదుగా భీమవరం వెళ్లనున్నాయి. వాహన రాకపోకలు మళ్లిస్తున్నట్లు ముందుగా సమాచారం లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అధ్యక్షా..

ఫ్లైఓవర్ సర్వీసు రోడ్లు వెంటనే నిర్మించాలి

తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ



తణుకు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై తణుకు మీదుగా ఉండ్రాజవరం జంక్షన్ వద్ద నిర్మించే ఫ్లైఓవరు ఇరువైపులా సర్వీసు రోడ్లు వెంటనే నిర్మించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులు నత్తనడక, కాంట్రాక్టరు తీరుపై గురువారం అసెంబ్లీలో ప్రస్తావించారు. నాలుగు సంవత్సరాల క్రితం ప్రారంభించిన బ్రిడ్జి పనులు కనీసం 60 శాతం కూడా పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాంట్రాక్టరు, జాతీయ రహదారి అధికారులతో మాట్లాడినా స్పందన లేదని సభ దృష్టికి తీసుకెళ్లారు. బ్రిడ్జి పనులు ఆలస్యమైనా ఇరువైపులా సర్వీసు రోడ్డులు పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం గుంతలు, బురదతో ప్రయాణికులు, వాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నారని వివరించారు. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారన్నారు. పొడి వాతావరణం ఉంటే దుమ్ము, ధూళితో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సర్వీసు రోడ్డుకు టెండర్లు పిలుస్తున్నామని చెబుతున్నప్పటికీ ఆరు నెలలు నుంచి పురోగతి లేదన్నారు. తేతలి వై జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కూడా చాలాకాలంగా నిలిచిపోయాన్నారు.

23న స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి ఎంపికలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలనో యాజమాన్యాల్లోని హైస్కూళ్ల బాలబాలికలకు అండర్-14, 17 వయస్సు విభాగాల్లో జిల్లాస్థాయి ఎంపికలను నిర్వహిస్తున్నట్టు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.అలివేలుమంగ గురువారం తెలిపారు. ఈ నెల 23న జూడో, హ్యాండ్‌బాల్ ఎంపికలు ఏలూరు ఇండోర్ స్టేడియంలో, బాస్కెట్‌బాల్ ఎంపికలు కొవ్వలి జడ్పీ హైస్కూలు క్రీడామైదానంలో ఉదయం 9గంటల నుంచి జరుగుతాయని వివరించారు. అండర్-14 క్రీడాకారులు 2012 జనవరి 1 తర్వాత, అండర్- 17 క్రీడాకారులు 2009 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలన్నారు. విద్యార్థులు జిల్లాస్థాయి ఎంట్రీఫాం, చదువుతున్న స్కూలు/కాలేజి హెచ్‌ఎం లేదా ప్రిన్సిపాల్ సంతకంతో అందజేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 90308 94311 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



మినుము విత్తనాలు అందిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

పల్లాకు తెగులు తట్టుకునే మినుము

రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మినుము పంటలో పల్లాకు తెగులు సమర్థవంతంగా ఎదుర్కొనే మినుము రకాలు సబ్సిడీపై రైతులకు అందిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి జడ్డు వెంకటేశ్వరరావు తెలిపారు. అప్పారావుపేట రెవెన్యూ పరిధిలోని మోదుగగుంట, అప్పారావుపేట, పుల్లాయిగూడెం గ్రామాల రైతులకు మినుము రకాలపై గురువారం అవగాహన కల్పించారు. తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో మినుము అధికంగా సాగు చేస్తున్నారని, 250 ఎకరాల్లో క్లస్టర్ డిమానిస్ట్రేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎల్‌బీజీ 884, 904 మినుము విత్తనాలు పల్లాకు తెగులు రాకుండా, ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని మార్టేరు వరిపరిశోధనా కేంద్రం ఏడీఆర్ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. రైతులకు సబ్సిడీపై మినుము విత్తనాలు అందించారు. ఏడీఏ గంగాధరరావు, ఏవో నారాయణరావు, సర్పంచ్ ఆరుగొల్లు శ్రీనివాస్, కట్టా జానకిరామయ్య, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ మోసం.. సొమ్ము రికవరీ



బాధితుడికి నగదును అందిస్తున్న ఏలూరు సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ దాసు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాళ్ల వలలో పడి రూ.40 వేలు పోగొట్టుకున్న బాధితుడు 1930కు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆ సొమ్ము రికవరీ చేసి తిరిగి అతడికి అందించారు. ఏలూరుకు చెందిన నాగదాసరి భారత రత్నరాజు ఇండియా మార్ట్ ద్వారా డయాలసిస్ స్టాక్ డయాలైజర్లు, రక్త ట్యూబులు కొనుగోలు చేశారు. ఒక సరఫరాదారు మాయమాటలతో రత్నరాజు రూ.40 వేలు చెల్లించాడు. తరువాత మరో 30 నిముషాల్లో రూ.10 వేలు ఇవ్వాలని, లేకుంటే స్టాక్ పంపబోమన్నారు. అంతేకాదు ముందకు చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వమని చెప్పడంతో మోసపోయినట్లు గుర్తించాడు. వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేసి తనకు జరిగిన మోసాన్ని వివరించారు. దీంతో ఏలూరు సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ దాసుకు సమాచారం అందడంతో ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు సీఐ దాసు, కానిస్టేబుల్ కె.సురేష్ దర్యాప్తు చేపట్టారు. బాధితుడు రత్నరాజు పోగొట్టుకున్న రూ.40 వేలు తిరిగి రప్పించారు. ఆ సొమ్మును ఏలూరు సైబర్ సెల్ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు రత్నరాజుకు ఇన్‌స్పెక్టర్ దాసు అందించారు. ఎవరైనా సైబర్‌నేరాలకు గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

14 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



వాహనం స్వాధీనం చేసుకున్న సీఎస్‌డీటీ

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంగిడిగూడెంలో రేషన్ బియ్యం వాహనంలో అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. జంగారెడ్డిగూడెం సీఎస్‌డీటీ జి. వెంకటేశ్వరరావు, సిబ్బంది గురువారం వాహనాన్ని అడుకుని 14 బస్తాల బియ్యం గుర్తించారు. ఏపీ 39 యుయు 3085 నెంబర్ గల వాహనం, పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకుని వాహన యజమాని చోడిశెట్టి సతీష్‌పై కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ జి.వెంకటేశ్వరరావు తెలియజేశారు.

ఉపాధ్యాయ అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ వాయిదా

» భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో నిర్ణయం



ఏలూరు అర్బన్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ ఉపాధ్యాయ అభ్యర్థులకు శుక్రవారం అమరావతిలో జరుగనున్న నియామకపత్రాల అందజేత కార్యక్రమం వాయిదా పడడంతో జిల్లా విద్యాశాఖ ఊపిరి పీల్చుకుంది. భారీవర్షాల హెచ్చరికల నేపథ్యంలో నియామకపత్రాల అందజేత కార్యక్రమాన్ని వాయిదా వేసినట్టు ఉన్నతాధికారుల నుంచి గురువారం ఉదయం 8.30 గంటలకు సమాచారం అందడంతో, ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముందస్తుగా గురువారం సాయంత్రం ఏలూరు చేరుకునేందుకు సమాయత్తమవుతున్న అభ్యర్థులకు కార్యక్రమ వాయిదా విషయాన్ని ఫోన్లద్వారా తెలియజేయడంతో ఎక్కడివారక్కడే ఆగిపోయారు. నియామకపత్రాల అందజేత తిరిగి ఎప్పుడు నిర్వహించేది మళ్లీ తెలియజేస్తామని అభ్యర్థులకు తెలిపారు.

లేబర్ ఆఫీసర్‌ని అంటూ ఫోన్ చేస్తే సమాచారం ఇవ్వండి

» తాడేపల్లిగూడెం లేబర్ ఆఫీసర్ గోపీకుమార్



తాడేపల్లిగూడెంరూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి గూడెంలో వర్తకులకు ఇటీవల ఓ వ్యక్తి తాను లేబర్ ఆఫీసర్‌ని అంటూ వ్యాపారులను బెదిరింపులకు పాల్పడుతున్నాడని అలా ఎవరైనా ఫోన్‌లు చేస్తే తనకు సమాచారం ఇవ్వాలని తాడేపల్లిగూడెం లేబర్ ఆఫీసర్ కె.గోపీకుమార్ కోరారు. తాడేపల్లిగూడెంలో గురువారం ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా తాడేపల్లిగూడెంలో ఐరన్ వ్యాపారులు, అపరాల వ్యాపారులకు ఒక వ్యక్తి తాను లేబర్ ఆఫీసర్‌ని అని, ఏలూరుకు లైసెన్స్ కాగితాలు తీసుకుని రావాలంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. ఆ విధంగా ఎవరైనా వ్యాపారులకు ఫోన్‌చేసి బెదిరిస్తే 94925 5507 నంబరుకు సమాచారం అందించాలన్నారు.



అథ్లెటిక్స్ పోటీల్లో ఎంపికైన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

రాష్ట్ర అథ్లెటిక్ పోటీలకు శ్రీసూర్య విద్యార్థుల ఎంపిక

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): ఇటీవల స్థానిక ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో తంగెళ్లమూడికి చెందిన శ్రీసూర్య పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని స్కూలు డైరెక్టర్ కె.చంద్రశేఖర్ తెలిపారు. లాంగ్‌జంప్, రన్నింగ్, హైజంప్ విభాగాల్లో ఎస్.కె.మోబిన, ఎం.డింపుల్ సాయి, పి.నాగఫణి,పి.జయచంద్ర, ఎస్.కె.ఆయుష్, ఎ.వివేక్, డి.సత్యమణికంఠ, టి.అక్షరకుమార్‌తోపాటు ఎస్.కె.రిఫత్, సుల్తాన ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు.

బ్యాడ్మింటన్ ఆడుతూ గుండెపోటుతో ఒకరి మృతి



పెనుమంట్ర, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉదయాన్నే చేసే వ్యాయామంలో భాగంగా షెటిల్ బ్యాడ్మింటన్ ఆడుతూ నల్లిమిల్లి గోపి(48) గుండెపోటుతో కుప్పకూలిపోయిన ఘటన పెనుమంట్ర మండలం మల్లిపూడిలో చోటు చేసుకుంది. ఆయనకు కుమారుడు కుమార్తె భార్య ఉన్నారు. గోపి నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం వైసీపీ విభాగం కన్వీనర్‌గా పనిచేశారు. వైసీపీ నాయకులు గుడిమెట్ల గంగాధర్ రెడ్డి, కర్రి వేణు బాబు, పాలసత్తి రామిరెడ్డి, సుంకర సీతారాం పరామర్శించారు.

వ్యభిచారం కేసులో ముగ్గురి అరెస్టు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏలూరు మెయిన్ బైపాస్ రత్నాస్ హోటల్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఏలూరు రూరల్ ఎస్ఐ బి.నాగబాబు తన సిబ్బందితో దాడి చేశారు. వ్యభిచారం నిర్వహిస్తున్న ఏలూరు ఆర్‌ఆర్ పేటకు చెందిన మిత్తిరెడ్డి సూరి అప్పుడు అలియాస్ కృష్ణను అదుపులోకి తీసుకున్నారు. అతను కొంతకాలంగా ఇతర ప్రాంతాలకు చెందిన యువతులను తీసుకొచ్చి వ్యభిచారం చేయిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు దాడి చేసిన సమయంలో అక్కడ విటులుగా ఉన్న కొందరిని అరెస్టు చేశారు. ఇద్దరు యువతులను అదుపులోకి తీసుకుని వారిని సంరక్షణ గృహానికి తరలించారు. వ్యభిచార గృహం నిర్వాహకుడైన మిత్తిరెడ్డి సూరి అప్పుడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటర్ డిక్కీలో నగదు మాయం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్కూటర్ డిక్కీలో పెట్టిన రూ.50 వేల నగదు అపహరణకు గురైందని ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు రూరల్ మండలం హనుమాన్ నగర్‌కు చెందిన చల్లా సాయి నిర్మల కుటుంబానికి ఏలూరు చేపల మార్కెట్ వద్ద కూల్ డ్రింక్ షాపు ఉంది. గురువారం ఉదయం షాపు వద్ద ఉండి సాయంత్రం 50 వేల రూపాయల నగదును నిర్మల తన స్కూటర్ డిక్కీలో పెట్టి నెహ్రూకాలనీలో ఉన్న తన తల్లి ఇంటికి వెళ్ళారు. అక్కడ రోడ్డుపై స్కూటర్ పెట్టి అర్ధగంట తరువాత తిరిగి హనుమాన్‌నగర్ తన ఇంటికి వచ్చి స్కూటర్ డిక్కీని ఓపెన్ చేసి చూడగా నగదు కనిపించలేదు. దీంతో ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

ముదినేపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళపై ఆమె సమీప బంధువు దౌర్జన్యానికి పాల్పడిన ఘటన బుధవారం రాత్రి ముదినేపల్లిలో జరిగింది. ఎస్ఐ వీఎస్ వీరభద్రరావు తెలిపిన వివరాలివి.. ముదినేపల్లికి చెందిన బొర్రా కుసుమ భర్త రెండేళ్ల క్రితం చనిపోగా అప్పటి నుంచి తల్లిదండ్రుల సంరక్షణలో పిల్లలతో కలిసి ఉంటుంది. ఆరు నెలల క్రితం కుసుమకు గుడివాడలో ఉంటున్న వరుసకు అక్కయ్యే నాగలక్ష్మి భర్త కొండరాజుతో పరిచయం ఏర్పడి అతడితో కలిసి ఈనెల 11న వెళ్లిపోయింది.తన కుమార్తె అదృశ్యంపై తండ్రి ముదినేపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఏలూరులో ఉన్న కుసుమ, కొండరాజులను ఈనెల 17న పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. అక్కడ నుంచి తన తండ్రితో కలిసి వెళ్తున్న తనపై మణికంఠ అనే వ్యక్తి దౌర్జన్యం చేసి తన చెల్లెలు భర్తతో వెళ్లిపోతావా అంటూ దుర్భాషలాడుతూ కొట్టాడని ఆమె ఫిర్యాదులో పేర్కొనగా ఎస్ఐ కేసు నమోదు చేశారు.

పోతనపల్లిలో బైక్ చోరీ

చాట్రాయి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనపల్లిలో బుధవారం రాత్రి ఇళ్ల ముందు పార్క్ చేసిన మూడు బైక్‌లను దొంగలు చోరీ చేశారు. వీటిలో రెండు బైక్‌లు స్టార్ట్ కాకపోవడంతో కొంత దూరంలో వదిలేసి, ఒక బైక్‌పై పారిపోయారు. పంచాయతీ ఆఫీస్ సమీపంలోని దళితవాడలో ఉన్న మూడు బైక్‌లను చోరీ చేసేందుకు ప్రయత్నించగా స్టార్ట్ కాకపోవడంతో రెండు బైక్‌లు వదిలేశారు. స్టార్ట్ అయిన ఒక బైక్ తీసుకెళ్లిపోయారు. దీనిపై చాట్రాయి పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని బాధితులు తెలిపారు.



తాడేపల్లిగూడెం ఉద్యాన వర్సిటీలో వెదురు మొక్కలు పాతుతున్న శాస్త్రవేత్తలు

'వెదురు' సకల జీవులకు వరం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పచ్చని బంగారంగా పేరుగాంచిన వెదురు రైతులకు, సకల జీవులకు వరమని విస్తరణా సంచాలకుడు డాక్టర్ బి. గోవిందరాజులు పేర్కొన్నారు. వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వద్ద గురువారం వరల్డ్ వెదురు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త విజయలక్ష్మి ఆధ్వర్యంలో వెదురు ప్లాంటేషన్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాగితం, ఫర్నీచర్, హస్తకళలు, నిర్మాణ రంగం వంటి వాటి ద్వారా అధిక ఆదాయం రావడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తలు బి. పెద్దబాబు, ఎ.దేవి వరప్రసాదరెడ్డి పాల్గొన్నారు.



ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అంబికా సంస్థల అధినేత అంబికా కృష్ణ, ఇతర ప్రతినిధులు

రేపటి నుంచి సాహిత్య సంగీత మహోత్సవాలు

ఏలూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలోని వైఎంహెచ్‌ఏ హాలులో ఈనెల 20, 21వ తేదీల్లో ఆలపాటి రామచంద్రరావు సాహిత్య సంగీత మహోత్సవాలు రెండు రోజుల పాటు నిర్వహిస్తామని అంబికా సంస్థల చైర్మన్ అంబికాకృష్ణ, వైఎంహెచ్‌ఏ ట్రస్ట్ మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు తెలిపారు. గురువారం ఏలూరు వైఎంహెచ్‌ఏ హాలులో అంబికా సంస్థలు, హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబికా సంస్థల వ్యవస్థాపకుడు ఆలపాటి రామచంద్రరావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 20న ఉదయం ప్రముఖ కళాకారులతో మహాసహస్రవధాని వద్దిపర్తి పద్మాకర్ ఆధ్వర్యంలో అష్టావధానాన్ని, సాయంత్రం 'భువన విజయం' నాటకం ఏర్పాటు చేశామన్నారు. 21న ఉదయం 10.30 గంటలకు విద్యార్థులకు, యువత, రచయితలకు సాహిత్య కార్యక్రమం, రాత సమీక్ష ఉంటుందన్నారు. సాయంత్రం ఆరు గంటలకు సంగీత సమ్మేళనంలో భాగంగా చెన్నైకు చెందిన సాయి హేమంత్ కృష్ణ బృందంచే నాసిక వేణునాదం, స్థానిక కళాకారులతో డాక్టర్ గుడిపాటి లలితా శర్మ నిర్వహణలో హేలాపురి సంగీత సౌరభం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎంహెచ్‌ఏ మేనేజ్‌మెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, సాయితేజ, గుడిపాటి లలితాశర్మ, బంకా ప్రసాద్, బొప్పన వెంకట్రాజు, పార్వతి రామచంద్రన్, పిలగల కొండలరావు పాల్గొన్నారు.

నేడు ఏలూరులో యూటీఎఫ్ బైక్ జాతా ముగింపు సమావేశం

ఏలూరుఅర్బన్, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ చేపట్టిన బైక్ జాతా ముగింపు సమావేశం ఏలూరులో శుక్రవారం జరుగుతుందని సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాల పెండింగ్, ఐఆర్ ప్రకటన, పీఆర్సీ నియామకం, తదితర డిమాండ్ల సాధనకు రాష్ట్రవ్యాప్తంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రణభేరి బైక్‌జాతా శుక్రవారం ఏలూరు జిల్లాలో ప్రవేశిస్తుందన్నారు. జిల్లాలో నారాయణపురం, భీ మడోలు, ద్వారకాతిరుమల, చింతలపూడి మీదుగా శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ఏలూరులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయానికి చేరుకుంటుందని వివరించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలోని ఐదు జిల్లాల సంఘ నాయకులు, మండలస్థాయి నాయకులతో సమావేశం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి టీచర్లు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చోరీ కేసులో నలుగురి అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కిరణాషాపులో ఒంటరిగా ఉన్న మహిళపై చాకుతో దాడి చేసి ఆమె మెడలోని నల్లపూసల గొలుసు అపహరించిన కేసులో నలుగురిని అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. ఏలూరు సమీపంలోని వట్లూరు అంగన్‌వాడీ కేంద్ర సమీపంలో నివాసం ఉంటున్న సింగంశెట్టి మల్లేశ్వరమ్మ(50) ఆమె భర్త చిల్లరకొట్టు నిర్వహిస్తున్నారు.ఆ ఇంటి ఎదురుగానే పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామానికి చెందిన సిద్దాని నాగదుర్గాభవానీ(25) ఆమె భర్త నాగరాజులు ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. దుర్గాభవానీకి తన గ్రామానికి చెందిన గంగులూరి రవితేజ (25)తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. తరచూ రవితేజ ఇంటికి వచ్చిపోతూ ఉంటాడు. అయితే నాగదుర్గాభవాని అద్దెకు ఉంటున్న ఇంటి ముందు కిరాణాకొట్టులో మల్లేశ్వరమ్మ ఒంటరిగా ఉండడం, ఆమె మెడలో నగలు కనిపించడంతో ఏ విధంగానైనా వాటిని అపహరించి పంచుకుందామని రవితేజ, నాగదుర్గాభవానీలు పథకం పన్నారు. వీరికి నాగరాజు, తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు రూరల్ మండలం తాడిమళ్ల గ్రామానికి చెందిన సింగులూరి సురేశ్ అలియాస్ సన్ని(28)ప్రస్తుతం ఏలూరు కంద్రికగూడెంలో ఉంటూ రవితేజకు సహకరిస్తున్నాడు. వీరంతా పథకం ప్రకారం ఈ నెల 14వ తేదీ సాయంత్రం రవితేజ కిరాణా దుకాణానికి వచ్చి మల్లేశ్వరమ్మను పాలు, కూల్ డ్రింక్ కావాలని వంద రూపాయలు ఇచ్చాడు. అవి తీసుకుని కూల్ డ్రింక్ తేవడానికి లోపలికి వెళ్తుండగా ఆమెతో పాటు వెనుకే వెళ్లి మెడలో ఉన్న బంగారు నల్లపూసల గొలుసు తెంపుతూ ఉండగా ఆమె కేకలు వేసింది. దీంతో తనతో తెచ్చుకున్న చాకుతో ఆమె వీపుపై, ముఖంపై దాడి చేశాడు. ఇంట్లో నుంచి పరిగెత్తుతున్న అతని వెంట ప్రజలు వెంటాడుతుండగా అంతలో సన్ని తన బైక్‌పై రవితేజను ఎక్కించుకుని పరారయ్యాడు. రవితేజ వేసుకొచ్చిన మోటారు సైకిల్ నాగదుర్గాభవానీ ఇంటి ముందు ఉండడం, చెప్పులు కూడా రోడ్డుపై పడి ఉండడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి సీసీ కెమేరాలను పరిశీలించారు. ఈ మొత్తం మీద ఈ నేరానికి పాల్పడిన ఈ నలుగురిని గురువారం అరెస్టు చేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంతోనే ఈ నేరానికి పాల్పడినట్టు వారు అంగీకరించారు. వారిని కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

మోటార్ సైకిళ్లే వీరి టార్గెట్..

ముగ్గురి అరెస్టు ● 12 మోటార్ సైకిళ్ల స్వాధీనం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మెటారు సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.8 లక్షల 10వేల విలువైన, 12 మోటారు సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కిషోర్, కేసు వివరాలు వెల్లడించారు. ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మోటారు సైకిళ్ళ చోరీలకు పాల్పడుతున్న భీమడోలు బీసీ కాలనీకి చెందిన మందపాటి జీవన్(20)ను అరెస్టు చేసి అతని నుంచి రూ. 4లక్షల 55 వేల రూపాయల విలువైన ఏడు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిడమర్రు సర్కిల్లో మోటారు సైకిళ్ళ చోరీలకు పాల్పడుతున్న ఉండి మండలం పాలమూరు గ్రామానికి చెందిన జక్కుల ప్రభుకుమార్(26), ఒక బాలుడిని అరెస్టు చేసి వారి నుంచి రూ.3 లక్షల 55 వేల విలువైన ఐదు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై దెందులూరు, తడికలపూడి, భీమడోలు, ద్వారకాతిరుమ, గన్నవరం, గణపవరం, నిడమర్రు, చేబ్రోలు, కలిదిండి, పెదపాడు, ఖమ్మం పోలీస్ స్టేషన్లలో మెటార్ సైకిల్‌కు సంబంధించిన కేసులు ఉన్నట్టు వెల్లడించారు. ఏలూరు వన్ టౌన్ ఇన్‌చార్జి సీఐ ఎం.సుబ్బారావు, ఎస్ఐ మదీనా బాషా, ఏలూరు రూరల్ ఎస్ఐ నాగబాబు, నిడమర్రు సీఐ ఎన్ రజనీకుమార్, గణపవరం ఎస్ఐ మణికుమార్‌లను వారి సిబ్బందిని ఎస్పీ కెపిఎస్ కిషోర్ అభినందించారు.

ఓఎల్‌ఎక్స్‌లో పెడితే ఇక అంతే..

మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న ఘరానా దొంగను పోలీసులు అరెస్టు చేశారు. ఓఎల్‌ఎక్స్‌లో ఎవరైనా మోటార్ సైకిల్ విక్రయించడానికి పెడితే వారినే టార్గెట్ చేస్తాడు ఈ దొంగ. గుంటూరు జిల్లా తాడేపల్లి కృష్ణానగర్‌కు చెందిన షేక్ ఇమ్రాన్(25) డిగ్రీవరకు చదివాడు. సులువుగా డబ్బు సంపాదించాలనే దురాశతో మోటార్ సైకిళ్ల చోరీని ఎంచుకున్నాడు. ఎవరైనా ఓఎల్‌ఎక్స్‌లో పెడితే నేరుగా వారి అడ్రస్‌కు వచ్చి మోటార్ సైకిల్ కాజేయడం ఇమ్రాన్ నైజం.. ఇదే తరహాలో ఏలూరు జిల్లా కలిదిండికి చెందిన తలారి జాస్పర్ కిరణ్ అనే యువకుడు మోటార్ సైకిల్‌ను విక్రయించాలనే ఉద్దేశంతో ఓఎల్‌ఎక్స్‌లో పెట్టాడు. ఫోన్ చేసి అడ్రస్ తెలుసుకుని నేరుగా కలిదిండి వచ్చాడు. కిరణ్ వద్ద ఉన్న బుల్లెట్ చూసి ట్రైల్ వేద్దామని చెప్పి ఇద్దరూ బయల్దేరారు. వేగంగా గురవాయిగూడెం వరకు కిరణ్‌ను ఎక్కించుకుని ఇమ్రాన్ మోటార్ సైకిల్‌పై తీసుకెళ్లాడు. మద్వానిగూడెం మలుపు వరకూ తీసుకెళ్లి ఎవ్వరూ లేని నిర్మానుష్య ప్రాంతంలో కిరణ్‌కు కత్తిచూపించి బెదిరించి మోటార్ సైకిల్‌ను ఇమ్రాన్ వేసుకుని వెళ్లిపోయాడు. ఫిర్యాదు మేరకు ఈ సంఘటనపై కలిదిండి పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని గుర్తించి అతని నుంచి ఆరు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం, కడప పలు పట్టణాల్లో ఇదే తరహాలో మోటారు సైకిల్ అపహరించినట్టు గుర్తించారు. ఈ మేరకు ఎస్పీ కిశోర్ మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, కలిదిండి ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లను అభినందించారు.

గాయపడిన బాలుడి ఆచూకీ లభ్యం



ఏలూరు క్రైం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తలపై కత్తిగాట్లతో అపస్మారక స్థితిలో నిర్మానుష్య ప్రదేశంలో ఉన్న బాలుడి ఆచూకీని పోలీసులు గుర్తించారు. ఏలూరు సమీపంలోని కలపర్రు టోల్‌గేటు సమీపంలో ఎస్వీ రంగారావు విగ్రహం దగ్గరలో నిర్మానుష్య ప్రదేశంలో తలపై గాయాలతో పడి ఉన్న బాలుడిని ఈనెల 17వ తేదీ రాత్రి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆ బాలుడి వివరాలు తెలియకపోవడంతో పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్, పెదపాడు ఎస్ఐలు లుక్ అవుట్ నోటీసును బుధవారం రాత్రి ప్రకటించి రాష్ట్రంలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించారు. దీంతో విజయవాడ రామవరప్పాడు గణేశ్ నగర్ ప్రాంతానికి చెందిన తురగా విజయ్ కుమార్(14)గా గుర్తించారు. ఈనెల 16వ తేదీ ఉదయం 10గంటలకు ఆ బాలుడు ఇంటి నుంచి బయట కు వచ్చి తిరిగి ఇంటికి చేరకపోవడంతో అతని తల్లి పటమట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె తల్లి ఇళ్లల్లో పాచిపని చేస్తూ కుమారుడిని పోషించుకుంటుంది. లుక్‌అవుట్ నోటీసును పోలీసులు ప్రకటించడంతో ఈ సమాచారాన్ని గంట వ్యవధిలోనే గుర్తించారు. ప్రస్తుతం ఆ బాలుడు గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతను స్పృహలోకి వస్తే కాని అతనిపై దాడిచేసిన వారి వివరాలు తెలిసే అవకాశం ఉంది. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో డాగ్‌స్వాడ్, క్లూస్ టీమ్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

జడ్పీ చైర్‌పర్సన్‌తో

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో ఈ నెల 19వ తేదీ శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహించనుంది. ఉమ్మడి జిల్లా జడ్పీ పరిధిలోని ప్రాంతాల్లో తాగు నీటి సమస్యలు, జడ్పీ పాఠశాలల్లోని మౌలిక వసతుల లేమి, గ్రామాల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రజలు సెల్ నెంబరు 94947 86277కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. వాటి పరిష్కారానికి ఆమె తగిన చర్యలు తీసుకుంటారు.



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కృష్ణారావు

పిప్పర హైస్కూల్లో పారిశుధ్య జిల్లా సమన్వయకర్త తనిఖీ

గణపవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న నాణ్యమైన విద్య, పోషక విలువలతో కూడిన మధ్యాహ్నం భోజన పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పారిశుధ్య జిల్లా సమన్వయకర్త కృష్ణారావు తెలిపారు. గురువారం పిప్పర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజన పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించి వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం సన్నబియ్యాన్ని, కోడిగుడ్ల సైజును, చిక్కీలు, తదితర సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 453 మంది విద్యార్థులు హాజరుకాగా 420 మంది భోజనం చేశారు. మిగిలిన విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించి భోజనం చేసేలా ఒప్పించారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర ఆవశ్యకతపై అవగాహన

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఓజోన్ పొరగురించి అవగాహన కార్యక్రమాన్ని గురువారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో నిర్వహించారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ మానవ మనుగడకు ఓజోన్ పొర చాలా అమూల్యమైందన్నారు. లఘునాటిక, పవర్‌పాయింట్ ప్రజంటేషన్, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలు వాసంతి, సిరి, రమీజా బృందం, గాయత్రి, మౌనిక, సమీర బృందాలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ సునీలారాణి పాల్గొన్నారు.

● సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

కామవరపుకోట: సీఎం సహాయనిధి చెక్కులను చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ లబ్ధిదారులకు మండల పరిషత్ సమావేశంలో అందజేశారు. టీడీపీ మండలాధ్యక్షులు ఏలూరి హరిరామకృష్ణ, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు, టీడీపీ నాయకులు మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, నెక్కలపు సూర్యనారాయణ ఉన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రోషన్

విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ


విద్యార్థినికి బుక్స్ అందజేస్తున్న కనకరాజు

పెదవేగి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకు ని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఉచిత రాతపుస్తకాలను అందిస్తున్నారని లక్ష్మీపురం సర్పంచ్ మేకా కనకరాజు అన్నారు. నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ రాత పుస్తకాలు ఉచితంగా అందించే ఏర్పాటు చేశారు. పెదవేగి మండలం లక్ష్మీపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాతపుస్తకాలను సర్పంచ్ కనకరాజు బుధవారం అందించారు. పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే ప్రభాకర్ సమకూర్చిన రాత పుస్తకాలను అందిస్తున్నామని ఆయన తెలిపారు. పార్టీనాయకులు మేకా రాజా, పరసా శ్రీనివాసరావు, యర్రా హనుమంతు పాల్గొన్నారు.

మత్స్యకార సంఘాన్ని నిర్వీర్యం చేయాలని చూడటం సరికాదు

టి.నర్సాపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మ మత్స్యకార సహకార సంఘాన్ని విధ్వంసం చేయడం తగదని బొర్రంపాలెంలో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. మత్స్యకారులు రేవు వద్దకు చేరి 2006లో ఏర్పడ్డ తమ సంఘంలో వేరేప్రాంతం నుంచి వచ్చిన కొందరూ తమతో కలిసి చేపల వేట కొనసాగించేవారని అన్నారు. తమ నుంచి వారంతా విడిపోయి వేరే సంఘం ఏర్పాటు చేసుకుని తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇందు కోసం స్థానికులు కొంతమంది వారికి సహకారం అందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సంఘాన్ని విడదీయాలని చూస్తే ఆందోళన చేయడమే మార్గమని వాపోయారు. సంఘ నాయకులు ధనరాజు, పాండురంగ, చిట్టియ్య పాల్గొన్నారు.


ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను సన్మానిస్తున్న సీఆర్ఆర్ పూర్వ విద్యార్థులు

విద్యార్థుల మెరిట్ స్కాలర్‌షిప్ నిధికి రూ.5 లక్షల విరాళం

పెదవేగి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం గొప్ప విషయమని, దీనికోసం తనవంతు సాయం అందిస్తామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఏలూరు సీఆర్ఆర్ పూర్వవిద్యార్థుల వార్షిక సర్వసభ్య సమావేశం కళాశాలలో ఉత్సాహంగా జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఆర్ఆర్ పూర్వవిద్యార్థి చింతమనేని మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందించేందుకు పూర్వ విద్యార్థుల సంఘానికి రూ.5 లక్షల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడుతూ ఎంతో ప్రఖ్యాతిగాంచిన సీఆర్ఆర్ విద్యాసంస్థలో పూర్వ విద్యార్థుల సంఘాన్ని స్థాపించి, అందులో 700మంది సభ్యులుగా చేరడాన్ని అభినందనీయమన్నారు. ఉపకార వేతనాలు అందించేందుకు సంఘం ఇప్పటికే రూ.60 లక్షలు సేకరించిందని, ఇందులో తనవంతుగా చింతమనేని చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.5 లక్షలు అందించినట్టు తెలిపారు. ఈ డిపాజిట్లపై వచ్చే వడ్డీని మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లుగా అందించి వారి ఉన్నతికి దోహదపడాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఐపీఎస్ అధికారి గంగాధర్‌ను పూర్వవిద్యార్థులు శాలువాతో ఘనంగా సత్కరించారు.

వైసీపీ హయాంలో అసంపూర్తిగా మెడికల్ కళాశాలలు

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కళాశాలలు కట్టించామని గొప్పలు చెబుతున్నారని టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం విమర్శించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఏ ఒక్క కళాశాల నిర్మాణాలు పూర్తి చేయలేదన్నారు. 35 నుంచి 40శాతం నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయని అన్నారు. ఏలూరు మెడికల్ కళాశాల సైతం 35 శాతం మాత్రమే నిర్మాణం పూర్తయ్యిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మెడికల్ కళాశాల నిర్మాణ పనులు వేగవంతం చేశాయన్నారు. వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అభివృద్ధి, సంక్షేమ పథకాలను పరుగులెత్తిస్తున్నామని అన్నారు. మెడికల్ కళాశాలలపై చర్చకు ఎక్కడైనా సిద్ధమేనని వైసీపీ నాయకులకు సవాల్ విసిరారు.

ఏజెన్సీకి చెందిన ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలి

కుక్కునూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ఉద్యో గాలు గిరిజనులతోనే భర్తీ చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూరం సంజీవరావు డిమాండ్ చేశారు. గురువారం గిరిజనుల సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైనందున ఆది వాసీ ఎమ్మెల్యేలు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి స్పందించి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జీవో నెంబర్ 3 స్థానంలో కొత్తచట్టాన్ని తీసుకొచ్చి వందశాతం ఉద్యోగాలు ఆదివాసీలతోనే ఏజెన్సీలో భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరి జనులకు న్యాయం జరగకపోతే తీవ్రస్థాయిలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. పొడియం వేణుగోపాల్, పైడా పరమేశ్వరరావు, జట్టి రఘు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో నిలువెత్తు నిర్లక్ష్యం..

● పడిపోయే స్థితిలో విద్యుత్ స్తంభం ● పట్టించుకోని అధికారులు


ఒరిగిపోయి ఉన్న విద్యుత్ స్తంభం

పోలవరం, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): పోలవరం మండల కేంద్రంలో స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న చుట్టుగుంట చెరువు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం ఒక పక్కకు ఒరిగి చెరువులో పడిపోయే స్థితికి చేరుకుంది. గత కొన్ని రోజులుగా ఆ స్తంభం అదే పరిస్థితిలో ఉన్నప్పటికీ విద్యుత్ శాఖ సిబ్బంది అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువులో స్థానిక మత్స్యకారులు చేపలు పెంచుతూ ఉంటారు, అంతేగాక ఆ మార్గంలో వెళ్లే గేదెలు అదే చెరువులో నీరు తాగడం, స్నానానికి దిగడం చేస్తుంటాయి. అదే మార్గంలో ఓ ప్రైవేటు విద్యా సంస్థకు చిన్నారులు విద్యార్థులు, సమీపంలో ఉన్న బీసీ కాలనీ ప్రజలు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. అంతేగాక సమీపంలో ఉన్న పంటపొలాల బోదెల నీరు చుట్టుగుంటలోకి ప్రవ హిస్తూ ఉంటాయి. స్తంభంపై ఉన్న విద్యుత్ తీగలకు నిత్యం విద్యుత్ ప్రవాహం జరుగుతూనే ఉంటుంది. ప్రమాదవశాస్తూ స్తంభం చెరువులో కూలితే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉందని అధికారులు స్పందించి స్తంభాన్ని అక్కడి నుంచి వేరు ప్రాంతానికి మార్చాలని ప్రమాదాల నివారణకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలని పలువురు కోరుతున్నారు.

కల్వర్టు క(వ్య)థ!

(5వ పేజీ తరువాయి)

పోలవరంలో కడెమ్మ స్లూయిజ్, ఏటిగట్టు, ధవళేశ్వరం ఆనకట్ట పనుల నిర్వహణ కోసం కచేరీ వద్ద కొన్ని కార్యాలయాలు నిర్మించారు. అదే సందర్భంలో ఏజెన్సీ గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు కచేరీ నుంచి ఇటుకలకోట వెళ్లేందుకు తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఉన్న కొండవాగును దాటేందుకు సుమారు 30 అడుగుల పొడవునా కల్వర్టు నిర్మించారు. ఆ కల్వర్టు అడుగు భాగం నుంచి కొండవాగులు కొవ్వాడ కాలువలోకి ప్రవహించేవి. కాలక్రమేణా కల్వర్టు అడుగున పూడికపట్టి ఉండడంతో కొండవాగులు కల్వర్టు పైనుంచి ప్రవహించి కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో ఆ మార్గంలో వెళ్లే వాహనాలు, ప్రజానీకం కల్వర్టుపై ఉన్న నీటిగుంటల్లో రోడ్డు కానరాక తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. కచేరీ నుంచి గుంజవరం వరకు రోడ్డు వేసే రహదారులు భవనాల శాఖ అధికారులు గానీ కాంట్రాక్టర్లు గానీ ఆ ప్రాంతంలో ఎలాంటి పునరుద్ధరణ చర్యలు చేయకుండా గాలికొదిలేసి మిగిలిన ప్రాంతంలో రోడ్డు వేసి మమ అనిపిస్తున్నారు. ఒక్కో సందర్భంలో ఆర్టీసీ బస్సు ఆ కల్వర్టు వద్ద నిలిచిపోయే పరిస్థితులు గతంలో నెలకొన్నాయి. అధికారులు స్పందించి కల్వర్టు పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రజానీకం కోరుతున్నారు.


కొయ్యలగూడెంలోని వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది


పూళ్లలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారి శోభ


తాడువాయిలో ప్రారంభిస్తున్న వైద్య శిబిరం

మహిళల ఆరోగ్యమే ప్రధానం

స్వస్థ్ నారీ - సశక్తి వైద్య శిబిరాల్లో వక్తలు

భీమడోలు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పూళ్ల ప్రాథమిక వైద్య కేంద్రంలో జరుగుతున్న స్వస్థ్ నారి, సశక్తి అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి యు.శోభ సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. సర్పంచ్ సుజాత, బీజేపీ నాయకులు అడపా శోభారాణి,శరణాల మాలతీ రాణి, కృష్ణారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: స్వస్థ్ నారీ - సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో మహిళల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు వైద్యాధికారులు డాక్టరు మోహిత్, డాక్టరు ఆమూల్య తెలిపారు. గురువారం నందాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నిమ్మలగూడెంలో కార్యక్రమంతో పాటు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. నేత్ర వైద్యుడు బి.ఎన్.కిశోర్ పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ బన్నె బుచ్చిరాజు, ఎంపీహెచ్ఈవో పి.పెద్దిరాజు, ఉష, వెంకటలక్ష్మి, కోటేశ్వరి సిబ్బంది, టీడీపీ నాయకులు వెత్స చిట్టిబాబు, జి.కన్నారావు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం:మహిళలు ఆరోగ్యం కుటుంబాన్ని ఎంతో ప్రభావితం చేస్తుందని రాష్ట్ర మహిళా టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి అన్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెడుతుందని మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్లు తస్లీమ, ఉమాశంకర్, ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ సూచించారు. గురువారం మండలంలోని తాడువాయి పీహెచ్‌సీలో నిర్వహించిన స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ మాట్లాడుతూ స్త్రీలలో వచ్చే గర్భాశయ, క్యాన్సర్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ మరోజ్ఞ మహిళలకు ఆరోగ్య సూత్రాల గురించి అవగాహన కల్పించారు. హెచ్‌వో సత్యనారాయణ, ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా పాల్గొన్నారు.

● టి.నర్సాపురం: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే బలమైన కుటుంబం ఏర్పడుతుందని మండల వైద్యాధికారిణి జె.కల్పన రాణి తెలిపారు. గ్రామంలో స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా టి.నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి కల్పనరాణి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు మాట్లాడుతూ మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కేతిరెడ్డి వీరారెడ్డి(చినబాబు), గంగ్ర కృపాకర్ రెడ్డి, డించినాల బ్రహ్మం, యలమంచి భాను ప్రసాద్, బండారు నాగేశ్వరరావు, రాచప్రోలు నవీన్, పీహెచ్ఎన్ కొవ్వాడమ్మ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సొంగా సింధూ పాల్గొన్నారు.

● పెదపాడు: పెదపాడు, వట్లూరు ప్రాథమిక ఆరోగ్యాకేంద్రాల పరిధిలో పెదపాడు, కొత్తూరు గ్రామాల్లో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య శిబిరాలను గురువారం నిర్వహించారు. పెదపాడు, వట్లూరు వైద్యాధికారులు డాక్టరు చక్రధర్, అనంతపాల్, సత్యనారాయణలు ఆధ్వర్యంలో మహిళలకు వివిధ రకాలైన క్యాన్సర్ పరీక్షలు, దంత సమస్యలు, చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధి పరీక్షలు, రక్తపరీక్షలు, గర్భిణీ స్త్రీలకు ప్రసూతి సంబంధిత పరీక్షలు నిర్వహించారు.

లక్కవరం సొసైటీ కమిటీ నియామకం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా పాకలపాటి వీర వెంకటసత్యవర ప్రసాద్, సభ్యులుగా ఆళ్ల బాలయేసు, కంభపు రాజేశ్వరిని నియమించినట్టు జిల్లా సహకార శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న వనజ

ప్రజా ఉద్యమాలకు సురవరం దిక్సూచి

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్నో చారిత్రాత్మక ఉద్యమాలకు సురవరం సుధాకర రెడ్డి దిక్సూచి అని సీపీఐ జాతీయ కార్యదర్శ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. గురువారం స్థానిక ఎంబీ సోషల్ క్లబ్ ఆవరణలో ఇటీవల మృతి చెందిన సీపీఐ జాతీయ సమితి మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకరరెడ్డి సంస్మరణ సభ సీపీఐ మండల కార్యదర్శి జంపన వెంకట రమణరాజు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా సురవరం చిత్రపటానికి ఆ పార్టీ ముఖ్య నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ సురవరం సుధాకరరెడ్డి అంచెలంచెలుగా సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఎదిగారన్నారు. విద్యుత్ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ సురవరం నేటి తరం యువతకు ఆదర్శమన్నారు. కారం దారయ్య,బాడిస రాము,ఎస్.రామ్మోహన్, గొలిమే బాలయేసు, ఆంజనేయరాజు, టీవీఎస్ రాజు, సుంకర రాధాకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, అల్లూరి రామకృష్ణ పాల్గొన్నారు.


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న సీఈవో శ్రీహరి

పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలి

ఉంగుటూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని జడ్పీ సీఈవో శ్రీహరి పేర్కొన్నారు. గురువారం బొమ్మిడి గ్రామాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి పారిశుధ్య పనులు జరుగుతున్న తీరును నిశితంగా పరిశీలించారు. వీధుల్లో తిరుగుతూ గ్రామస్థులతో మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా పంచాయతీ సిబ్బందికి అందజేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో చంద్రశేఖర్, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.


వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

వృద్ధులకు పండ్లు పంపిణీ

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):జనసేన నాయకులు నారా శేషు పుట్టిన రోజును పురస్కరించుకుని వృద్ధాశ్రమాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు.మాదేపల్లిలోని ప్రేమాలయం వృద్ధాశ్రమం, ఏఎంసీ వికలాంగుల పాఠశాలలో దివ్యాంగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి వారికి భోజనాలు సిద్ధం చేశారు. జనసేన నాయకులు పాల్గొన్నారు.


సర్పంచ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పార్వతి

సర్పంచ్‌ను కలిసిన ఏఎంసీ చైర్మన్

లింగపాలెం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రంగాపురంలోని శ్రీసత్యనారాయణ స్వామిని, ఆసన్నగూడెంలోని శివాలయాన్ని చింతలపూడి ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన సి.హెచ్.దుర్గాపార్వతి, మధుబాబు దంపతులు దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా దర్శించుకుని అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటానని, వారి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. అనంతరం జనసేన, కూటమి నాయకులు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ మునునూరి రామును మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన పార్టీ మండల నాయకులు పి.మహేశ్‌బాబు, చల్లా నాగబాబు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి

నిడమర్రు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన సేవలందిచడం కోసం వైసీపీ ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలు నిర్మిస్తే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు పరం చేయడం సరికాదని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం భువనపల్లి క్యాంపు కార్యాలయంలో ఈ నెల 19న 'చలో మెడికల్ కాలేజీ' పేరుతో చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో అంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, జడ్పీటీసీ కోడే కాశీ, దండు రాము, కమ్మిల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

లింగపాలెం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ టీడీపీ అండగా ఉంటుందని అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం రిలీఫ్‌ఫండ్ ఆసరాగా ఉంటుందని గరిమళ్ల చలపతిరావు,మోరంపూడి మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన డోలా రమేశ్, పెదలంక రాములుకు సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కులు అందించారు. సర్పంచ్ బొంతు రాంబాబు, బొంతు శ్రీను, తాతిన రాధా కృష్ణ, ఎం.జయరాజు, పి.రాజు, పి.ప్రసాద్ పాల్గొన్నారు.


నిడమర్రులో ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

జీతాలు పెంచాలంటూ వీఆర్ఏల ధర్నా

నిడమర్రు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా రెవెన్యూ వ్యవస్థనే నమ్ముకుని జీవిస్తున్న తమకు న్యాయం చేయాలంటూ గ్రామ రెవెన్యూ సహాయకులు నిరసన తెలిపారు.గురువారం నిడమర్రు తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ సహాయకులు ధర్నా నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షులు సంకెళ్ల మోహనరావు మాట్లాడుతూ తక్కువ వేతనంతో ఎన్నో ఏళ్లుగా రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న తమకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. 18, 19 తేదీల్లో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తుమన్నారు. 11 వేలు కనీసం వేతనంతో పనిచేస్తున్నామని వాపోయారు. కార్యదర్శి దాసరి కోటేశ్వరరావు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

హద్దు మీరితే ఉపేక్షించం

● ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్


మహిళ అర్జీ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియాలో కొందరు హద్దులు మీరి ప్రవర్తిస్తున్నారని, అలాంటివారిని ఉపేక్షించబోమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు.దుగ్గిరాలలో గురువారం వివిధ గ్రామాల ప్రజల నుంచి వచ్చిన వినతులు ఆయన స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలిచ్చారు. ప్రజలు ఛీకొట్టినా వైసీపీ శ్రేణులు సోషల్ మీడియాలో విషప్రచారం చేస్తూ ఆనందిస్తున్నారని, ఇది సరైన విధానం కాదని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేని వైసీపీ శ్రేణులు ఆందోళనతో అసత్య ప్రచారాలకు తెగబడుతున్నారని, అలాంటివారికి కూటమి ప్రభుత్వం తగిన బుద్ధి చెబుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

రామస్వామి పోరాటం స్ఫూర్తిదాయకం

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించాలని అవిశ్రాంతంగా పోరాడిన పెరియార్ రామస్వామి పోరాట స్ఫూర్తి ఆదర్శనీయమని ప్రముఖ నాస్తికులు పెరియార్ అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం సీపీఐ కార్యాలయంలో తమిళనాడుకు చెందిన పెరియార్ రామస్వామి జయంతిని ఏపీ హేతువాద సంఘం ఆధ్వర్యంలో కె.రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. పెరియార్ చిత్రపటానికి వక్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ న్యాయవాది వాకాడ రాజారావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే, డి.రవికుమార్, కె.నరసింహం, డి.గంగాధరరావు, కె.సత్యనారాయణ, పుప్పాల కన్నబాబు, శ్యామల, బుగత జగన్నాథం, ఎం.క్రాంతికుమార్, గేదెల నాగేశ్వరరావు, కనకం జగన్, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెదవేగి ఇన్‌చార్జి ఎంపీడీవోగా రవికుమార్

పెదవేగి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పెదవేగి ఇన్‌చార్జి ఎంపీడీవోగా కార్యాలయ పరిపాలనాధికారి కె.రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన రవి కుమార్‌ను కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ అలీ, కార్యదర్శులు కృష్ణంరాజు,వరప్రసాద్, సంధ్యారాణి, బాబ్జి, కార్యాలయ సిబ్బంది అభినందించారు. ఇప్పటి వరకు ఎంపీడీవోగా పనిచేసిన పి.శ్రీనివాస్ పదోన్నతిపై నూజివీడు డ్వామా ఏపీడీగా బదిలీ అయ్యారు. రవికుమార్ మాట్లాడుతూ మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి పథంలో నిలపడానికి తనవంతు కృషి అందిస్తామన్నారు.


శ్రీలతను సత్కరిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరాజు, సిబ్బంది

బదిలీపై వెళ్లిన ఎంపీడీవో శ్రీలతకు సత్కారం

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏలూరు ఎంపీడీవోగా ఏడాది కాలం పనిచేసి అనంతరం డ్వామా పీడీగా బదిలీ అయిన వెన్న శ్రీలతను స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, ఎంపీడీవో బి.దయాసాగర్,ఏవో పి.సత్యనా రాయణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ ఎస్.కడెమ్మ, జయప్రకాశ్ ఆధ్వర్యంలో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. టీడీపీ ఏలూరు రూరల్ మండలాధ్యక్షులు నంబూరి నాగరాజు, కొల్లేరు సంఘం అధ్యక్షులు సైదు సత్యనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జి నేతల రవి పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న లింగంపాడు గ్రామస్థులు

రైల్వే గేటు నిర్మాణంపై అభిప్రాయ సేకరణ

భీమడోలు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): భీమడోలులో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించిన తరువాతే రైల్వే గేటు మూసివేతకు చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారులను లింగంపాడు గ్రామస్థులు కోరారు. భీమడోలు పంచాయతీ ఆవరణలో గురువారం తహసీల్దార్ రమాదేవి అధ్యక్షతన గ్రామసభలో గ్రామస్థుల అభిప్రాయ సేకరణ చేపట్టారు. రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి ఎటువంటి ఇబ్బంది లేదని, భీమడోలు శివారు లింగంపాడు అలాగే వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బంది లేకుండా చూడాలని గ్రామస్థులు కోరారు. లింగంపాడు గ్రామస్థులతో పాటు, స్థానిక రైతులు అంగీకారం తెలపగా అధికారులు తీర్మానం చేశారు. భీమడోలులో నిర్మించే రైల్వే ఓవర్ బ్రిడ్జిని రైల్వే గేటు మీదుగా కాకుండా వడ్లపట్ల, భీమడోలు గ్రామాల మధ్య ప్రాంతాల్లోని వ్యవసాయ క్షేత్రాల మీదుగా నిర్మించేలా అధికారులు ప్రణాళిక చేస్తున్నట్టు తహసీల్దార్ తెలిపారు.రైల్వేగేటు మీదుగా నిర్మించేందుకు అనేక అడ్డంకులు ఉన్నాయన్నారు.

గన్ని వీరాంజనేయులుకు వినతి..

మండ లంలోని కురేళ్లగూడెం, పూళ్ల మధ్యలో ఉన్న పి.కన్నాపురం రైల్వే క్రాసింగ్ గేటు సమీపంలో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అందుకు సహకరించాలని గ్రామస్థులు ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులుకి వినతి పత్రం అందజేశారు. గురువారం గన్ని క్యాంప్ కార్యాలయానికి వచ్చిన గ్రామస్థులు వినతిపత్రం అందించగా సానుకూలంగా స్పందించిన గన్ని ఎంపీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం సహకార సంఘాల్లో ద్వితీయ స్థానంలో నిలిచి అవార్డు అందుకున్న గన్నిని గ్రామస్థులు సత్కరించారు.

నేడు క్యాన్సర్ ఉచిత పరీక్షలు

దెందులూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై మెరుగైన వైద్య సేవల ద్వారా మహిళలు వారి కుటుంబాలను, దేశాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్‌ను నిర్వహిస్తోందని దెందులూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కలపాల శ్రీహరి తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఈ వైద్య శిబిరంలో క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తారని డాక్టర్ సుందరిబాబు అన్నారు.

'అక్షర ఆంధ్ర' పుస్తకాలు సిద్ధం

దెందులూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అక్షరాస్యతను పెంచేందుకు ప్రభుత్వం అక్షర ఆంధ్ర కార్యక్రమం కోసం పుస్తకాలను సిద్ధం చేశామని దెందులూరు వెలుగు శాఖ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పులి సురేశ్ అన్నారు. గురువారం దెందులూరు వెలుగు శాఖ కార్యాలయంలో వయోజన విద్యకు సంబంధించి పుస్తకాలు సిద్ధం చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 17పంచాయతీల్లో 2400మంది చదువు లేని పెద్దవారు ఉన్నారని వారి కోసం 240 మంది వలంటీర్లకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు.

షిర్డీ సాయికి అభిషేకాలు అర్చనలు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): భాద్రపద మాసంలోని గురువారం కావడంతో స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీషిర్డీ సాయి మందిరం వద్ద బాబాకు భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బాబి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారపుపేటలోని షిర్డీ సాయి ప్రేమమందిర్ వద్ద ఆలయ అధ్యక్షులు ఇసుకపల్లి తాతారావు భక్తులకు మహా అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేశారు.



రక్తదానం చేసిన యువత

పెదపాడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వట్లూరులోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 12మంది శిక్షణ పొందుతున్న యువతీ యువకులు రక్తదానం చేశారని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎంబీఎస్వీ ప్రసాద్ తెలిపారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ లీడ్ బ్యాంక్ మేనేజర్ నీలాద్రి మాట్లాడుతూ 45 రోజులు స్వయం ఉపాధి శిక్షణ పొందుతున్న యువతీ యువకులతో ప్రతి బ్యాచ్‌తో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం సంతోషకరమని, సేవా కార్యక్రమాల్లో పాల్గొని రక్తదానం చేసేలా యువతను ప్రోత్సహిస్తున్నందుకు ఆ సంస్థ డైరెక్టర్ ఫణి కిశోర్‌కు అభినందనలు తెలిపారు. శిక్షణ డైరెక్టర్ ఫణి కిశోర్, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వర ప్రసాదరావు, పీఆర్వో కె.వి.రమణ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం

పెదపాడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటానని పెదపాడు మండల ఎలక్ట్రికల్ ఏఈగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కె.శివశంకరం తెలిపారు. ఎలక్ట్రికల్ ఏఈగా గురువారం బాధ్యతలు చేపట్టిన శివశంకరంను విద్యుత్ శాఖ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఏఈ శివశంకరం మాట్లాడుతూ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ విద్యుత్ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. బదిలీపై వెళ్లిన ఏఈ వై.రాంబాబు, అసిస్టెంట్ ఏఈ శివాజీ పాల్గొన్నారు.

నేడు అన్నదానం

పోలవరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో శ్రీచైతన్య ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఐదువేల మందికి అన్నదానం నిర్వహించనున్నట్టు ఆటో యూనియన్ సభ్యులు గురువారం తెలిపారు. గణపతి నవరాత్రులు ముగింపు సందర్భంగా ఈ అన్నదానం నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొనాలని ఆటో యూనియన్ సభ్యులు పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వేగివాడ విద్యుత్ ఉపకేంద్రంలో నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీ ఏలూరు ఈఈ కేఎం.అంబేడ్కర్ తెలిపారు. వేగివాడ విద్యుత్ ఉప కేంద్రంతో పాటు తాళ్లగోకవరం విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ సరఫరా తెల్లవారు జామున 3 నుంచి ఉదయం 10.30గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు వ్యవసాయ బావులకు విద్యుత్ సరపరా ఉంటుందని, రైతులు గమనించాలని విజ్ఞప్తి చేశారు. గృహ అవసరాల విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం ఉండదని అన్నారు.

పేకాటలో ముగ్గురి అరెస్టు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రు గ్రామంలో పేకాట నిర్వహిస్తున్నట్లు రూరల్ ఎస్ఐ పి.నాగబాబుకు సమాచారం అందడంతో తన సిబ్బందితో దాడి చేశాడు. అక్కడ పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.4 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

గోసంరక్షణ శాలకు దాణా వితరణ

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీవారి గోసంరక్షణ శాలకు ఓ దాత గురువారం 11 టన్నుల దాణాను అందజశారు. విజయవాడకు చెందిన నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు ఈ దాణాను ఆలయ అధికారులకు అందజేశారు. ఈ యనకు ఈవో కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నంపేటలో క్రీడాకారుల ఎంపిక పోటీలు



చాట్రాయి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపేట జడ్పీ హైస్కూల్‌లో గురువారం మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంఈవో-1 శ్రీనివాస్ ప్రారంభించారు. పోటీలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ విభాగాలలో సీనియర్ జూనియర్ బాలురు, బాలికల జట్లను ఎంపిక చేసినట్టు హెచ్ఎం ఎ.లక్ష్మి తెలిపారు. పీడీలు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

అయ్యవారి రుద్రవరంలో 'స్వచ్ఛ పక్వాడ'

మండవల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అయ్యవారిరుద్రవరం హరిజనవాడలో వున్న మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 'స్వచ్ఛ పక్వాడ' కార్యక్రమం నిర్వహించారు. గురువారం పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, హ్యాండ్‌వాష్, వర్షం నీళ్లను ఎలా సంరక్షించుకోవాలి తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సీహెచ్ పిచ్చేడు, ఉపాధ్యాయురాలు జయశ్రీ, మండవల్లి క్లస్టర్ సీఆర్ఎంటి సుబ్రహ్మణ్యం, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'నియోజకవర్గ అభివృద్ధికి నిధులు సమకూర్చండి'



అసెంబ్లీ ఆవరణలో లోకేశ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కైకలూరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు సమకూర్చాలని ఐటీ శాఖమంత్రి నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ కోరారు. గురువారం అమరావతిలోని అసెంబ్లీ ఆవరణలో మంత్రులు నారా లోకేశ్‌ను, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసి కైకలూరు పరిస్థితులను వివరించారు. నియోజకవర్గంలో పాఠశాలలు, కళాశాలలకు అదనపు తరగతి గదులు, ప్రహరీలతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు అందించామని వాటిని త్వరితగతిన ఆమోదించాలని కోరారు. అనంతరం ఇటీవల నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులపై లోకేశ్‌తో చర్చించారు. డిప్యూటీ సీఎం పవన్‌తో కొల్లేరు పరిస్థితులను సుప్రీంకోర్టు సాధికార కమిటీ పర్యటన అనంతరం జరుగుతున్న పరిణామాలపై అయనకు వివరించారు. ప్రజలకు, పర్యావరణానికి నష్టం లేకుండా ఉండేలా చూద్దామని హామీ ఇచ్చినట్లు కామినేని తెలిపారు.

నేడు మంత్రి కార్యాలయం వద్ద లాయర్ల నిరసన

నూజివీడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని కోరుతూ ది బార్ అసోసియేషన్ ఆఫ్ నూజివీడు ఆధ్వర్యంలో లాయర్లు శుక్రవారం ఉదయం రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి కార్యాలయం వద్ద నిరసన చేపడతామని అసోసియేషన్ నాయకుడు, న్యాయవాది కె.సత్యప్రకాశ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, ప్రస్తుత మంత్రి కె.పార్థసారథి ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా ప్రజల ఆకాంక్షల మేరకు నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలుపుతామని బహిరంగ సభలో హామీ ఇచ్చారని, అయితే ఆ దిశగా సన్నాహాలు జరుగుతున్నట్లు కనిపించటం లేదని తెలిపారు. ఈ నిరసనలో అన్నివర్గాల ప్రజలు కలిసి రావాలని కోరుతున్నామన్నారు.

ఒత్తిడి తెస్తున్నా.. కమిటీ పరిశీలిస్తోంది : మంత్రి సారథి

నూజివీడు నియోజకవర్గ ప్రజల ఆకాంక్షమేరకు నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకుని వెళ్లాను. ఏలూరు నుంచి నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలు తొలగిస్తే ఐదు నియోజకవర్గాలతో జిల్లా ఏ విధంగా ఉంటుంది ? అనే విషయాలను కమిటీ పరిశీలిస్తోంది.

తలసైనిక్ క్యాంపులో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ



ఎన్‌సీసీ కేడెట్లతో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్

నూజివీడు టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఎన్‌సీసీ కేడెట్ల నైపుణ్యానికి దిక్సూచిగా నిలిచే ఆలిండియా తలసైనిక్ క్యాంపులో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్. అమరేంద్రకుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్‌కు చెందిన జూనియర్ అండర్ ఆఫీసర్లు అయిన షేక్ కరీనాజాను, ఇందు ఈనెల ఒకటో తేదీ నుంచి 12వ తేదీ వరకు న్యూఢిల్లీలో నిర్వహించిన ఆలిండియా తలసానిక్ క్యాంపును విజయవంతంగా పూర్తి చేశారన్నారు. జాతీయస్థాయిలో ఎన్‌సీసీ కేడెట్ల నైపుణ్యం, ధైర్యాన్ని పరీక్షించేందుకు ఈ క్యాంపు నిర్వహిస్తారని కర్నల్ బాలిందర్‌సింగ్ మార్గదర్శకత్వంలో విద్యార్థులు టెంట్ పిచింగ్ పోటీలో బంగారు పతకాన్ని సాధించారన్నారు. అంతేకాకుండా షేక్ కరీనాజాను జడ్జింగ్, డిస్టెన్స్, ఫీల్డ్ సిగ్నల్స్ పోటీలో టాప్‌ర్యాంక్ సాధించారన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని ఎన్.ఐ.ఐ.ఎం.ఏ.ఎస్‌లో నిర్వహించిన అడ్వాన్స్ అడ్వెంచర్ క్యాంపును నూజివీడు క్యాడెట్ దాత్రిజా విజయవంతంగా పూర్తి చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా కేడెట్లను అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఏవో లక్ష్మణరావు, అకడమిక్ డీన్ చిరంజీవి తదితరులు అభినందించారు.

ఓఎల్‌ఎక్స్‌లో పెడితే ఇక అంతే..

బైకల దొంగ అరెస్ట్


కలిదిండి/ఏలూరు క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న ఘరానా దొంగను పోలీసులు అరెస్టు చేశారు. ఓఎల్‌ఎక్స్‌లో ఎవరైనా మోటార్ సైకిల్ విక్రయించడానికి పెడితే వారినే టార్గెట్ చేస్తాడు ఈ దొంగ.. గుంటూరు జిల్లా తాడేపల్లి కృష్ణానగర్‌కు చెందిన షేక్ ఇమ్రాన్(25) డిగ్రీవరకు చదివాడు. సులువుగా డబ్బు సంపా దించాలనే దురాశతో మోటార్ సైకిళ్ల చోరీని ఎంచుకున్నాడు. ఎవరైనా ఓఎల్‌ఎక్స్‌లో పెడితే నేరుగా వారి అడ్రస్‌కు వచ్చి మోటార్ సైకిల్ కాజేయడం ఇమ్రాన్ నైజం.. ఇదే తరహాలో ఏలూరు జిల్లా కలిదిండికి చెందిన తలారి జాస్పర్ కిరణ్ అనే యువకుడు మోటార్ సైకిల్‌ను విక్రయించా లనే ఉద్దేశంతో ఓఎల్‌ఎక్స్‌లో పెట్టాడు. ఫోన్ చేసి అడ్రస్ తెలుసుకు నేరుగా కలిదిండి వచ్చాడు. కిరణ్ వద్ద ఉన్న బుల్లెట్ చూసి ట్రైల్ వేద్దామని చెప్పి ఇద్దరూ బయల్దేరారు. వేగంగా గురవాయి గూడెం వరకు కిరణ్‌ను ఎక్కించుకుని ఇమ్రాన్ మోటార్ సైకిల్‌పై తీసుకెళ్లాడు. మద్వానిగూడెం మలుపు వరకూ తీసుకెళ్లి ఎవ్వరూ లేని నిర్మా నుష్య ప్రాంతంలో కిరణ్‌కు కత్తిచూపించి బెదిరిం చి మోటార్ సైకిల్‌ను ఇమ్రాన్ వేసుకుని వెళ్లిపోయాడు. ఫిర్యాదు మేరకు ఈ సంఘటనపై కలి దిండి పోలీసులు కేసు నమోదు చేసి నిందితు డిని గుర్తించి అతని నుంచి ఆరు మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం, కడప పలు పట్ట ణాల్లో ఇదే తరహాలో మోటారు సైకిల్ అపహ రించినట్లు గుర్తించారు. ఈ మేరకు ఎస్పీ కిశోర్ మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడిం చారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవే క్షణలో కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, కలిదిండి ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు, కానిస్టేబు ళ్లను అభినందించారు.

కల్వర్టు క(వ్య)థ !

(5వ పేజీ తరువాయి)

పోలవరంలో కడెమ్మ స్లూయిజ్, ఏటిగట్టు, ధవళేశ్వరం ఆనకట్ట పనుల నిర్వహణ కోసం కచేరీ వద్ద కొన్ని కార్యాలయాలు నిర్మించారు. అదే సందర్భంలో ఏజెన్సీ గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు కచేరీ నుంచి ఇటుకలకోట వెళ్లేందుకు తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఉన్న కొండవాగును దాటేందుకు సుమారు 30 అడుగుల పొడవునా కల్వర్టు నిర్మించారు. ఆ కల్వర్టు అడుగు భాగం నుంచి కొండవాగులు కొవ్వాడ కాలువలోకి ప్రవహించేవి. కాలక్రమేణా కల్వర్టు అడుగున పూడికపట్టి ఉండడంతో కొండవాగులు కల్వర్టు పైనుంచి ప్రవహించి కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో ఆ మార్గంలో వెళ్లే వాహనాలు, ప్రజానీకం కల్వర్టుపై ఉన్న నీటిగుంటల్లో రోడ్డు కానరాక తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. కచేరీ నుంచి గుంజవరం వరకు రోడ్డు వేసే రహదారులు భవనాల శాఖ అధికారులు గానీ కాంట్రాక్టర్లు గానీ ఆ ప్రాంతంలో ఎలాంటి పునరుద్ధరణ చర్యలు చేయకుండా గాలికొదిలేసి మిగిలిన ప్రాంతంలో రోడ్డు వేసి మమ అనిపిస్తున్నారు. ఒక్కో సందర్భంలో ఆర్టీసీ బస్సు ఆ కల్వర్టు వద్ద నిలిచిపోయే పరిస్థితులు గతంలో నెలకొన్నాయి. అధికారులు స్పందించి కల్వర్టు పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రజానీకం కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

చీపురుగూడెం అడవి రోడ్డుకు మహర్దశ

చీపురుగూడెం-మంకొల్లు మధ్య రోడ్డు నిర్మాణం



చీపురుగూడెం- మంకొల్లు మధ్య నిర్మించిన బీటీ రోడ్డు (ఇన్‌సెట్‌లో) ఆనాటి రహదారి దుస్థితి (ఫైల్)

చాట్రాయి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో చీపురుగూడెం-మంకొల్లు గ్రామాల మధ్య గోతులమయంగా ఉన్న అడవి రోడ్డుకు మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో మహర్దశ వచ్చింది. ఈరెండు గ్రామాల మధ్య 12 ఏళ్ల క్రితం ఐదు కిలో మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై పనులు జరుగుతుండగా, దీనిలో ఒక కిలో మీటరు రోడ్డు తమ పరిధిలో ఉందని ఫారెస్ట్ అధికారులు పనులు అడ్డగించారు. ఆ కిలోమీటరు వదిలేసి మిగిలిన నాలుగు కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మించారు. నిలిచిన ఒక కిలోమీటరు రోడ్డు వర్షాలకు భారీ గోతులు పడి దారుణంగా తయారయింది. కొన్ని నెలల క్రితం చీపురుగూడెం వచ్చిన మంత్రి పార్థసారథికి టీడీపీ నాయకులు, ప్రజలు రోడ్డు దుస్థితిని విరించారు. స్పందించిన ఆయన అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో అటవీశాఖ నుంచి అనుమతి తీసుకుని బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ఈమేరకు రోడ్డు సమస్యను పరిష్కరించిన మంత్రికి టీడీపీ నాయకులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల ధర్నా



ముదినేపల్లిలో ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

ముదినేపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ముదినేపల్లి తహసీల్దారు కార్యాలయం వద్ద మండలంలోని వీఆర్ఏలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్ఏల మండల సంఘం నాయకులు సురేష్, బలరామ్, వసంతరావు, నూర్జహాన్, శివ పార్వతి, రాజేష్, సునీత మాట్లాడుతూ వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని, అర్హులైన వీఆర్ఏలకు పలు కేటగిరీల్లో ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు లతీఫ్‌కు వినతిపత్రం అందజేశారు.

● కలిదిండి : జీతాలు పెంచాలని కోరుతూ వీఆర్ఏలు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ వీఆర్ఏలకు ప్రమోషన్లు కల్పించాలన్నారు. చనిపోయిన వీఆర్ఏల కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. వీఆర్ఏల మండల అధ్యక్షుడు కోనా విజయ్, ఉపాధ్యక్షుడు గరికిముక్కల లక్ష్మణ, నాయకులు నరసయ్య, జేమ్స్, నాగరాజు, యాకోబు, నాగలక్ష్మి, ఝాన్సీ పాల్గొన్నారు.

చెరువు సర్వేకు సహకరించని అధికారులు



మాట్లాడుతున్న సర్పంచ్ నాంచారయ్య, పాలకవర్గ సభ్యులు

చినకామనపూడి పంచాయతీ సర్పంచ్, పాలకవర్గ సభ్యుల ధ్వజం

ముదినేపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం చినకామనపూడి గ్రామంలో పంచాయతీ వూర చెరువు సరిహద్దులను గుర్తించేందుకు సర్వే చేయాలని ఎన్నిసార్లు కోరినా అధికారులు స్పందించడం లేదని సర్పంచ్ చిట్టూరి వీర వెంకట సత్యనాంచారయ్య, ఉప సర్పంచ్ భట్రాజు లక్ష్మి, సభ్యులు ధ్వజమెత్తారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. ఆ చెరువు ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేసే పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉండగా చెరువు హద్దులు తేల్చడంలో అధికారులు సహకరించడం లేదన్నారు. చెరువు తవ్వడానికి సరిహద్దులు నిర్ణయించాలని జిల్లా స్థాయి నుంచి, మండల స్థాయి వరకు రెవెన్యూ, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ఒత్తిళ్లకు తలొగ్గకుండా చెరువు సర్వేకు అధికారులు సహకరించాలని సర్పంచ్‌తోపాటు పాలకవర్గ సభ్యులు కోరారు. సమావేశంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సామగ్రి అందజేత

ముసునూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం వేల్పుచర్ల గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు, మాస్కులు, గ్లౌస్ అండ్ అప్రాన్, దుస్తులను సర్పంచ్ పుట్ల మోహన్‌రావు అందజేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు భోజనవసతి ఏర్పాటు చేశారు. పారిశుధ్య కార్మికుల పనితీరుతో గ్రామంలో చెత్త సేకరణ సక్రమంగా జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. కార్యదర్శి శ్రీనివాసచౌదరి తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుడికి జనసేన నాయకుల పరామర్శ



శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న శివరామకృష్ణ తదితరులు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన కల్లుగీత కార్మికుడు బెజవాడ శ్రీనివాసరావును ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన అధికార ప్రతినిధి మరీదు శివ రామకృష్ణ, ఇతర నాయకులు పరామర్శించారు. విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా హాస్పిటల్‌కి వెళ్లి శ్రీనివాసరావు, అతడి కుటుంబసభ్యులను పరామర్శించి న్యాయం జరిగేవరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చింతా అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

400 మంది విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు

ముసునూరు, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి):మండలంలోని చెక్కపల్లి జడ్పీ పాఠశాలలో విజయవాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యాక్సీ విజన్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, విజయడెంటల్ ఆసుపత్రి వైద్యులు పాఠశాలలోని సుమారు 400మంది విద్యార్థులకు కంటిపరీక్షలు, దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన విద్యార్థులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లను అందచేస్తామని లయన్స్‌క్లబ్ సెక్రటరీ రావిసురేష్‌బాబు తెలిపారు. అనంతరం లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీపీ కొండా దుర్గాభవానీ, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు గద్దె శేషగిరి, తాతినేని శ్రీహరిరావు, పోలవరపు నరసింహారావు, మాజీ జడ్పీటీసీ చిలుకూరి వెంకటేశ్వరరావు, నాయకులు

ఆడబిడ్డల ఆరోగ్య పరిరక్షణే 'స్వస్థ్ నారీ సశక్తి' లక్ష్యం



చినతాడినాడలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జాహ్నవి



గన్నవరంలో వైద్య పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్ పవిత్ర

చాట్రాయి/ముసునూరు/ సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డల ఆరోగ్య పరిరక్షణే స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ లక్ష్యమని వక్తలు పేర్కొన్నారు. చాట్రాయి మండలం చనుబండ-2 సచివాలయిలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో 154 మందికి పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీనివాసరెడ్డి, దుర్గాప్రసాద్ పలు రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార స్టాల్ ఏర్పాటు చేసి సమతుల ఆహారంపై అవగాహన కల్పించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు మోరంపూడి శ్రీనివాసరావు, కూటమి నాయకులు ద్రోణంరాజు వాసు, బుర్రి శ్రీకర్, మారేశ్వరరావు, కందుల కృష్ణ, నక్కా రాము, నవరం రామారావు తదితరులు పాల్గొన్నారు. ముసునూరు మండలం సూరేపల్లిలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు చల్లగుళ్ళ మల్లిబాబు నేతృత్వంలో రమణక్కపేట పీహెచ్‌సీ వైద్యులు రమ్య ఆధ్వర్యంలో 184మంది మహిళలకు వైద్యపరీక్షలను నిర్వహించారు. 12మందికి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్టు వైద్యులు తెలిపారు.

కైకలూరు నియోజకవర్గంలో..

●ముదినేపల్లి/మండవల్లి/కలిదిండి: ముదినేపల్లి మండలం శ్రీహరిపురంలో గురజ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.రాణి శిరీషాబాయి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మహిళలకు పరీక్షలు నిర్వహించారు. చిరుధాన్యాల ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. శ్రీహరిపురం, కోమర్రు సర్పంచ్‌లు పరసా విశ్వేశ్వరరావు, కూనపరెడ్డి సాయి కృష్ణ, గురజ పీహెచ్‌సీ సీహెచ్‌వో ముత్తయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ కె.జోనాతన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుందరమ్మ పాల్గొన్నారు. మండవల్లి మండలం గన్నవరంలో డాక్టర్ పవిత్ర ఆధ్వర్యంలో మహిళలకు నోటి క్యాన్సర్, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. నీటి సంఘం అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. కలిదిండి మండలం కలిదిండిలో 180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కలిదిండి పీహెచ్‌సీ వైద్యాధికారిణి జాహ్నవి, సర్పంచ్ గంటికోట ఏసుబాబు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతోనే అనారోగ్య సమస్యలకు చెక్



చింతలవల్లిలో స్టాల్‌ను సందర్శిస్తున్న టీడీపీ నాయకులు

ముసునూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోషక విలువలతో కూడిన ఆహారాన్ని సక్రమంగా తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తవని టీడీపీ అధ్యక్షుడు కాటేపల్లి సురేంద్ర అన్నారు. గురువారం చింతలవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మహోత్సవాల్లో భాగంగా పౌష్టికాహార పదార్థాలు, కూరగాయలు స్టాల్స్‌ను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అంగన్‌వాడీలు అవగాహన కల్పించారు. టీడీపీ నాయకులు పాలడుగు నాగేంద్రబాబు, ప్రశాంత్, ఆశావర్కర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మునిసిపల్ కార్మికులు

పీఆర్సీ విడుదల చేయాలని కార్మికుల నిరసన

నూజివీడు టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పీఆర్సీని ప్రకటించాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నూజివీడు మునిసిపల్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు జి.రాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు పీఆర్సీని విడుదల చేయాలని, సమ్మె కాలానికి జీతం వెంటనే విడుదల చేయాలని, సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. నూజివీడు యూనియన్ నాయకులు జయలక్ష్మి, రజిని, శ్యామలాదేవి, పంగిడమ్మ, భారతి, గౌరి పాల్గొన్నారు.

ఎన్జీవో హోమ్‌లో..

పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని ఏపీ గెజిట్ నాన్‌గెజిట్ అసోసియేషన్ నూజివీడు డివిజన్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం ఎన్జీవో హోమ్‌లో అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్ వెంటనే వేయాలని, డీఏ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి పి.రమేష్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులందరూ ఏపీ ఎన్జీవోలో సభ్యత్వం పొందాలని సూచించారు. నూజివీడు తాలూకా యూనిట్ కార్యదర్శి టి.శ్రీనివాసబాబు, ట్రెజరర్ వెంకటేశ్వర్లు, సందీప్ పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

ముదినేపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళపై ఆమె సమీప బంధువు దౌర్జన్యానికి పాల్పడిన ఘటన బుధవారం రాత్రి ముదినేపల్లిలో జరిగింది. ఎస్ఐ వీఎస్ వీరభద్రరావు తెలిపిన వివరాలివి.. ముదినేపల్లికి చెందిన బొర్రా కుసుమ భర్త రెండేళ్ల క్రితం చనిపోగా అప్పటి నుంచి తల్లిదండ్రుల సంరక్షణలో పిల్లలతో కలిసి ఉంటుంది. ఆరునెలల క్రితం కుసుమకు గుడివాడలో ఉంటున్న వరుసకు అక్కయ్యే నాగలక్ష్మి భర్త కొండరాజుతో పరిచయం ఏర్పడి అతడితో కలిసి ఈనెల 11న వెళ్లిపోయింది. తన కుమార్తె అదృశ్యంపై తండ్రి ముదినేపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఏలూరులో ఉన్న కుసుమ, కొండరాజులను ఈనెల 17న పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. అక్కడ నుంచి తన తండ్రితో కలిసి వెళ్తున్న తనపై మణికంఠ అనే వ్యక్తి దౌర్జన్యం చేసి తన చెల్లెలు భర్తతో వెళ్లిపో తావా అంటూ దుర్భాషలాడుతూ కొట్టాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పోతనపల్లిలో బైక్ చోరీ

» స్టార్ట్ కాకపోవడంతో మరో రెండు బైక్‌లు వదిలి వెళ్లిన దొంగలు

చాట్రాయి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనపల్లిలో బుధవారం రాత్రి ఇళ్ల ముందు పార్క్ చేసిన మూడు బైక్‌లను దొంగలు చోరీ చేశారు. వీటిలో రెండు బైక్‌లు స్టార్ట్ కాకపోవడంతో కొంత దూరంలో వదిలేసి, ఒక బైక్‌పై పారిపోయారు. వివరాలివి.. మాజీ సర్పంచ్ కారంగుల శ్రీనివాసరావు, పంచాయతీ ఆఫీస్ సమీపంలో జక్కం ప్రహ్లాద్, దళితవాడలో మరో వ్యక్తికి చెందిన మూడు బైక్‌లను తస్కరించి కొంత దూరం నడిపించుకు వెళ్లారు. అక్కడ బైక్‌లు స్టార్ట్ చేసేందుకు ప్రయత్నించగా, రెండు బైక్‌లు స్టార్ట్ కాలేదు. దీనితో జక్కం ప్రహ్లాద్ బైక్ తీసుకెళ్లిపోయారు. దీనిపై చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని బాధితులు చెప్పారు.

చాట్రాయి ఎంపీడీవోగా రాజు బాధ్యతల స్వీకరణ



చాట్రాయి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): చాట్రాయి ఎంపీడీవోగా బి.రాజు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు ఎంపీడీవోగా పని చేస్తున్న రాజును ఇక్కడకు బదిలీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న రెగ్యులర్ ఎంపీడీవో దుర్గాప్రసాద్ గత ఏడాది సెప్టెంబరులో రిటైర్డు కాగా అప్పటి నుంచ ఇన్‌చార్జిలతో కార్యాలయం నడుస్తున్నది. ఆయనను చనుబండ పీఏసీఎస్ అధ్యక్షుడు మోరంపూడి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు నక్కా రాము, పరసా శ్రీను, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

నేరాల నియంత్రణకు నిఘా

చాట్రాయి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలతో నిఘా పెంచామని ఎస్ఐ డి.రామకృష్ణ అన్నారు. చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఉన్న సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో పనిచేసేవిధంగా చర్యలు తీసుకున్నామన్నారు. అనుమానితుల కదలికలపై నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నామన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు, అనుమానుతులు కన్పిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ సూచించారు.

టీడీపీ బీసీ నేత సర్వేశ్వరరావు మృతి



సర్వేశ్వరరావు (ఫైల్)


చాట్రాయి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): చాట్రాయి గ్రామానికి చెందిన టీడీపీ బీసీ నాయకుడు కంపసాటి సర్వేశ్వరరావు(51) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వగృహంలో గుండెపోటు వచ్చి కుప్పకూలి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన భౌతికకాయానికి టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



మృతుడి భార్యకు చెక్కు అందిస్తున్న నాయకులు, బ్యాంకు మేనేజరు

రూ.2 లక్షల చెక్కు అందజేత

ముసునూరు, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి) : గుళ్ళపూడి గ్రామానికి చెందిన దుదిగం రంగారావు ఇటీవల ప్రమాదవశాత్తు పాముకాటుకు గురై మృతిచెందాడు. మృతుడు చెక్కపల్లి గ్రామంలో ఉన్న అక్కిరెడ్డిగూడెంశాఖ స్టేట్ బ్యాంకులో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకం కింద సంవత్సరానికి రూ.436 ప్రీమియం చెల్లిస్తున్నాడు. ఈమేరకు మృతుడికి బీమా పథకం కింద మంజూరైన రూ.2లక్షలు చెక్కును గురువారం సర్పంచ్ తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, ఎంపీటీసీ కాటేపల్లి పుష్పావతి శ్రీనివాసరావు, బీఎం ప్రవీణ్‌కుమార్ నామినీగా ఉన్న మృతుడి భార్య సుధారాణికి అందజేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాటేపల్లి సత్యనారాయణ, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జాగ్రత్తలను వివరిస్తున్న సీడీపీవో దీప్తి

'ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి'

కైకలూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైనటువంటి జీవనశైలిని అలవర్చుకోవాలని సీడీపీవో దీప్తి సూచించారు. గురువారం కైకలూరు వెలమపేట 15వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల అనేకమంది స్థూలకాయం బారిన పడుతున్నారని దాని నివారణకు చక్కెర, నూనె వినియోగం తగ్గించి వాడాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు స్థూలకాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ ఆషా, అంగన్వాడీ టీచర్లు టి.ఉషా, ఎల్.మీనాకుమారి, డి.కల్యాణి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.